శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై!
సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీకీ జై!!



సన్నుతి సేయగా..
సమ్మతి నీయరా..
దొరా!

# గురుకృప

## గురుపూర్ణిమ సంచిక



## అన్వేషణా దృక్పథం

**గురుబంధువు :** ఒక అధ్యాయమో లేక ఒక పేరానో పారాయణ చేయకూడదా అండీ!


**గురువుగారు :** ఒక్క పేరానా, ఒక్క వాక్యమా అని కాదమ్మా నేను చెప్పటం. ఇలా చెయ్యడం వలన మీరు పిల్లలను ఏం చేస్తున్నారంటే ఒక రొటీనుకు అలవాటు చేస్తున్నారు. దాని బదులు, ఇంత కష్టపడే దానికంటే కూడాను, చక్కగా వాళ్ళలో ఆ అన్వేషణా దృక్పథాన్ని కలుగచేయండి. అపుడు మీరు ఒక నిజమైన ఉపాధ్యాయునిగా, ఒక మంచి తల్లిగా ఉండగలరు. వాళ్ళకు ఒక నియమంలాగా పెట్టి, ఒక అధ్యాయం చదవరా, నీకు మేలు కలుగుతుంది, ఒక అయిదు వాక్యాలు చదవండ్రా! అని చెప్పకండి. ఒక అధ్యాయము, ఒక వాక్యము, ఒక పుస్తకము. ఇక్కడ అవి కాదు ముఖ్యం. వాళ్ళలో ఎటువంటి జిజ్ఞాస లేకుండా, ఒకదాని గురించి ఒక అలవాటుగా ఒక పని చేయించడం తప్పు. అదీ నేను చెప్తుండేది. మీకు తెలుసు.

సంపుటి : 26
సంచిక : 3



గురుపూర్ణిమ సంచిక
3 జూలై 2023

గురుకృప



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...



ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది. - శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో

**పథగామి** 4
- గురుకృప

**అమృతోత్సవం** 10
- గురుకృప

**మందడుగు-ముందడుగు** 13
- మాటలు-మంత్రాలు

15 **బాబాను ప్రార్థించేటప్పుడు...**
- శ్రీబాబూజీ

17 **అనన్య భక్తికి .....**
- గురుకృప

26 **గురుకృపాలహరి**
- గురుకృప



నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు**

**GURUKRUPA**
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# పథగామి

## మానవత్వ పూర్ణత్వమే మహాతత్త్వం! మహితతత్త్వం! దివ్యత్వం!

"ఎందుకీ జీవితంలోకి వచ్చింది పిడకలు ఏరుకోవడానికా? అన్నారు –శ్రీసాయిబాబా. మనిషి జీవితం నలగడానికి కాదు ఉన్నది. మనిషి దేవుడై ఈ భూమి మీద వెలగడానికి అది ఉన్నది. కనుక జీవితాన్ని చిన్నచూపు చూడగూడదు. ఆకాశంలో నల్లని మబ్బులు క్రమ్ముకున్నాయి. సూర్యుడు కూడా వెలవెలబోతూండగా దట్టంగా మేఘాలు అల్లుకు పోయాయి. చిన్నచిన్నగా చినుకులు మొదలయ్యాయి. కొద్దిసేపట్లోనే అది జడివానగా కురుస్తోంది. వానకు తడుస్తూ ఒక చెట్టు, ఆ చెట్టుపైన ఒక పక్షిగూడు ఉన్నది. వర్షానికి ఆ పక్షిగూడులోని పసికూన తడిసిపోబోతుండగా తల్లిపక్షి తన పొట్ట క్రింద దానిని పొదివి పెట్టుకొని, రెక్కలతో కప్పేసుకుంది. వర్షం పెద్దదవుతోంది. తన తలను మెడతోపాటు క్రిందకు వంచుకొని రెక్కల క్రిందకు చేర్చుకుంది. పెరిగిన వానకు ముద్దగా తడిసిపోతోంది ఆ తల్లి పక్షి, పాపం లోకం కూడా తెలియని పసికూన కిక్కురు మనకుండా తల్లి అందిస్తున్న వెచ్చదనపు హాయిని అనుభవిస్తూ కళ్ళుమూసుకొని, నిద్రపోతుంది. ఆ తల్లి పక్షి తాను తడిసి ముద్దయిపోతూ కూడా కష్టాన్ని తన నెత్తినేసుకొని బిడ్డకు రక్షణనిచ్చేందుకు తాపత్రయ పడుతోంది. తన బిడ్డల బ్రతుకు చూస్తుంది కాబట్టి దీనిని **మాతృత్వం** అనవచ్చేమో. ఇట్లే ఇతరులందరి గురించి (తన బిడ్డల గురించి వలే) చూడగలిగితే, అదే ఉన్నతమైన, ఉత్తమమైన జీవతత్త్వం!

ఒక వృద్ధుడు దాహార్తితో ఎండలో సొమ్మసిల్లి పడిపోయాడు. కళ్ళు తేలేశాడు. ఈ క్షణమో, మరుక్షణమో ప్రాణాలు పోయేలా ఉన్నాయి. అతడి పరిస్థితిని చూస్తూ కూడా తమ దారిన తాము వెళ్ళిపోతున్న వారే ఎక్కువమంది. అయితే ఒక చిన్న పిల్లవాడు మాత్రం పరుగెట్టుకుంటూ వెళ్ళి నీళ్ళు త్రాగించాడు. ఆ వృద్ధుడి ప్రాణాలు నిలబడ్డాయి. ఇదే మానవత్వం, మనిషితత్త్వం.

**మానవత్వం అంటే :** మనిషికి ఉండాల్సిన అసలైన గుణం మానవత్వం! అంటే సాటి జీవులను అన్నింటినీ (దోమ, చీమల దగ్గర నుండి సాటి, తోటి మనిషి వరకు ప్రతి జీవినీ) తనను తాను చూసుకుంటున్నట్లు, తనను తాను ప్రేమించుకుంటున్నట్లు, తన అవసరాలను శ్రద్ధగా చూసుకుంటున్నట్లు ఉండటమే మానవత్వం. కాకుంటే చాలా మంది మానవత్వాన్ని మాటల్లో చూపిస్తుంటారు. చేతల్లోకాదు! ఎదుటివారికి చెప్పేటప్పుడు, వారెలా ఉండాలో తామే తీర్పులిస్తూ... మానవత్వం కలిగి ఉండాలని హితబోధ చేస్తుంటారు!



మనిషి తాను కోల్పోయిన తత్త్వమైన మానవత్వాన్ని తిరిగి పొందేందుకే మొట్ట మొదటగా బంధాలు, బంధుత్వాలు, స్నేహాలు, బాంధవ్యాలను ఏర్పరచాడు భగవంతుడు. **(పరులందరు పరాత్పరుడే)**. వ్యక్తికి మొదట తల్లిదండ్రులతో బంధం ఏర్పడుతుంది. అదే సమయంలో సోదరీ-సోదర బంధాలు, అప్పుడే తల్లిదండ్రుల తరపున ఉండే బంధుత్వాలు, తదుపరి స్నేహబంధాలు సహజంగానే ఏర్పడుతాయి. కానీ తాను ఏ వ్యక్తితో ఏ బంధం కలిగి ఉన్నాడో, ఆ బంధాన్ని సవ్యంగా సాగించగలగాలి. దానిని సవ్యంగా సాగించగలగడమంటే (ఏ బంధంలోనైనా) అవతలి వ్యక్తి యొక్క శ్రేయస్సును ఎప్పుడూ కాంక్షిస్తూ ఉండగలగాలి. కానీ ఇప్పటి వ్యక్తులను అంటే, మనలను మనము చూసుకుంటే బిడ్డలకుగానీ, భర్త లేదా భార్యకుగానీ, స్నేహితులకుగానీ మరెవరికైనా గాని తగు శ్రేయస్సు అందించే దిశలో మన మనస్సు ఉంటున్నదా? మనం చేసే పనులు, తీసుకుంటున్న నిర్ణయాలు మన బాంధవ్యంలోని వ్యక్తులకు శ్రేయస్సు చేకూరుస్తున్నాయా? ఇటీవల ఒక విచిత్రమైన భావన రూపుకట్టుకుని మనుష్యులను తికమకపెడుతున్నది. ఈ సంసారాలూ, బంధుత్వాలూ అన్నీ బంధాలనీ, ఇవన్నీ మోక్షానికి అడ్డాలని, వీటిని ఎంత త్వరగా తెంచుకుంటే అంత మంచిదని. పోనీ అలా అనుకున్న వాళ్ళు తెంచు కుంటున్నారా? తెంచుకోలేరు. ఉంచుకుంటున్నారా? ఉంచుకోలేరు. ఊరికే మధ్యలో అనవసరంగా నలుగుతున్నారు.

**మనిషి దైవంగా ఎదగడం బాబా మతం :** మనిషి జీవితం నలగడానికి కాదు ఉన్నది. మనిషి దేవుడై ఈ భూమి మీద వెలగడానికి అది ఉన్నది. కనుక జీవితాన్ని చిన్నచూపు చూడకూడదు. బంధుమిత్రులను బంధాలుగా భ్రమించకూడదు. ఆయా రూపాలలో ఉన్నది భగవంతుడే, **మనకు దగ్గర కావాలని - బంధుత్వాలను ఏర్పరచుకున్నాడు ఆయన.** కనుక బంధుత్వాలు బంధాలుగా కాక అనుబంధాలుగా రూపొందాలి. **'ఎఫెక్షన్స్'** మన మధ్య ప్రవహించడానికి **'కనెక్షన్స్'**గా పనిచేయాలి. ఎఫెక్షన్ పవిత్రమైనపుడు జీవితంలో **'పర్ఫెక్షన్'** మనకు సిద్ధిస్తుంది. **'ఎఫెక్షను'** బదులు **'ఎవర్షన్'** (అయిష్టం)ను మనం పెంచుకున్నప్పుడు అది 'పర్వర్షను'(వక్రబుద్ధి)కి దారి తీస్తుంది. వేదాంతం పేరిట మీరు ఎవర్షన్కు లోనుకాకండి, ఎండిపోకండి. స్వార్థమెరుగని ఎఫెక్షన్ను (అనుబంధం) ప్రవహింపజేయండి. అది మిమ్మల్ని విశ్వప్రేమ వైపు నడిపిస్తుంది. శ్రీకృష్ణుడు భార్యలతో నడిపిన సరస సల్లాపాల సార్థకత అప్పుడు మనకు బోధపడుతుంది. ఇక్కడ చిత్రమైన సూక్ష్మం. అతడు ఏమి చేశాడు. వారి వారి అభిరుచులను పరామర్శించాడు, ప్రోత్సహించాడు.



**మహాత్ములున్నదెందుకు? :** అదెలాగా? అంటే, దానికి సమాధానం బాబానే వివరించి వున్నారు. "భక్తులకు ఐహికంగానూ, ఆముష్మికంగానూ లాభం చేకూర్చడానికి మహాత్ములున్నది" అనేవారు బాబా. అంతేకాదు! డబ్బు, వ్యాపారము, ఆరోగ్యము, సంతానము, ఉద్యోగము తదితర విషయ సంబంధమైన సమస్యలతో కోరికలతో బాబాను ఆశ్రయించే భక్తులను నిరసిస్తూ, "శ్రీసాయిబాబా వంటి సద్గురువును ఆధ్యాత్మికోన్నతి కోసం ప్రార్థించాలిగాని, తుచ్ఛమైన ప్రాపంచిక కోరికలతో ఆశ్రయించకూడదు" అని హితవు చెబుతున్న ఒక భక్తునితో బాబా, "అలా అనొద్దు! నాకు సంబంధించి వారు మొదట అలాంటి కారణాలతోనే నా దగ్గరకు వస్తారు. వారి కోరికలు తీరి జీవితంలో సౌఖ్యం చిక్కాక, నన్ను అనుసరించి ఆధ్యాత్మికంగా పురోగమిస్తారు. నిజానికి, రకరకాల మిషల మీద నేనే వారిని నా దగ్గరకు రప్పించుకొంటాను. వారెంత దూరాన ఎక్కడ వున్నా సరే, నేనే వారిని కోరి నా వద్దకు చేర్చుకొంటాను. ఎవరూ వారంతట వారుగా నా దగ్గరకు రారు!" అని బాబా అన్నారు.

మనకిష్టమైన మార్గంలో నడిపిస్తూ, జీవితంలో సౌఖ్యం చిక్కాక ఆయన్ని అనుసరించి గమ్యం చేరుకునేలా చేస్తారు సద్గురువు (సాయిభక్తి సాధనా రహస్యం).

మనలో చాలామందికి మన విషయమే గుర్తుంటుంది. మన అభిరుచులే గుర్తుంటాయి. మనకు తగ్గట్లుగా మన అభిరుచులను గమనించుకుంటూ మనతో ఉన్నవారు మనకు సహకరిస్తూ ఉండాలని మనకు అనిపిస్తూ ఉంటుంది. మరి ఎదుటి వాళ్ళకు కూడా కొన్ని ఇష్టాలు ఉంటాయి కదా! కొన్ని అభిరుచులు ఉంటాయి కదా! ఎదుటి వారి అభిరుచుల ఎడల మేల్కొని, సహకరించ గలిగినవారు మనలో ఎందరున్నారు?.

ఎదుటివారి అభిరుచులు మనకు బోధపడాలంటే, మనం మన పరిధి దాటి ఎదుటివారిని సమీపించగలగాలి. వారిని స్పృశించగలగాలి, వారిని బోధపరచుకోగలగాలి. ఒక్కమాటలో చెప్పాలంటే మనం వారి స్థానంలో నిలబడాలి. మనం వారై పోవాలి. అప్పుడే వారి అభిరుచులు ఏమిటో, ఆకాంక్షలు ఏమిటో మనకు నిజంగా బోధపడేది. మనకు తోటివారితో అద్వైత స్థితి సిద్ధించినప్పుడే అది సాధ్యం.

**శ్రేయస్సు అంటే ? :** భౌతికమైన వస్తుజాలాన్ని చుట్టూ ఏర్పరచడమో, ఎదురెదురుగా కూర్చోవడమో, కాలక్షేపానికి కబుర్లు చెప్పడమో కాదు. తరాలు తిన్నా తరగని ఆస్తులు ఇస్తేనో, ఆర్థికపరంగా చేయూతనిస్తేనో, సుఖాలనిచ్చే వస్తుజాలాన్ని అందిస్తేనో, సంతోషాలనిచ్చే విషయాలలో



పాలుపంచుకుంటేనో, అదే నిజమైన ఉల్లాసమనిపించేలా ఉబుసుపోని కబుర్లు చెపుతుంటేనో... అదే బాంధవ్యమనీ, వారి వల్ల కలుగుతున్న భౌతికపరమైన, అశాశ్వతమైన లబ్ధినే శ్రేయస్సుగా పొరబడుతుంటాము. ఇదే శ్రేయస్సు అనుకోవడానికి మూలకారణం. ఎవరికివారు కేవలం శారీరక, మానసిక సుఖాలను ఆశిస్తూ స్వార్థత్వముతో నిండి ఉండటమే!

శ్రేయస్సు అంటే శాశ్వతమైన దానిని అందుకొని, శాశ్వత ఆనందము, విరామమెరుగని శాంతి కలిగించడమే! నిజానికి శాశ్వతమైనది (దైవం) మరెక్కడోలేదు. అట్లే ఆ ఆనందమునుగానీ, శాంతినిగానీ మరొకరు ప్రత్యేకంగా కలిగించేదేమీ ఉండదు. అవన్నీ ప్రతి వ్యక్తిలోనూ ఉన్నాయి. ఆ ఉన్నాయన్న విషయాన్ని గుర్తెరిగేలా చేయడమే శ్రేయస్సు కలిగించడం.

వ్యక్తిలో అణువణువునా స్వార్థం నిండి, తాను తన సుఖాల గురించి మాత్రమే యోచన కలిగియుండటం వల్ల (ఇతరుల శ్రేయస్సు కాంక్షించక పోతుండటంవల్ల) ఎందరితో సంబంధ బాంధవ్యాలు ఉన్నా, అవన్నీ గడ్డిపోచ వంటి గట్టిదనాన్ని కలిగియుండటం వల్ల, మనిషిలో మానవత్వం మృగ్యమైపోతోంది. మానవత్వం మృగ్యమైన వాని చుట్టూ ఎందరు ఉన్నా, ఎంతటి సంపదలున్నా, ఎంత కీర్తి ఉన్నా అతడు ఎడారి బాటసారి మాత్రమే! మానవత్వం లేని వాడు మృగతుల్యుడు! ఇతరుల శ్రేయస్సు కాంక్షించకుండా, తన గురించి లేదా తన కుటుంబం గురించి మాత్రమే ఆలోచించి, ఆ దిశలో మాత్రమే అడుగులు వేసేవాడు పతనం వైపు పయనిస్తున్నట్లే! జన్మలను, కర్మలను పెంచుకు పోయేందుకే అతడి అడుగులు పడుతుంటాయి. (నా భక్తుడిని పతనం కానివ్వను... శ్రీసాయి).

మనిషిలో దయ, ప్రేమ, కరుణ ఇత్యాది గుణాల స్థాయి పెరగాలి. ఆ స్థాయి పెరిగినప్పుడు అతడు కలిగియున్న ఏ బంధమైనా శ్రేయస్సుతో దృఢపడుతుంది. అప్పుడు ఆ వ్యక్తి యొక్క ప్రతి పనిలోనూ మానవత్వపు కోణం ప్రస్ఫుటమై ఉంటుంది. ఈ మానవత్వమే విశాలమయ్యే కొద్దీ దైవత్వంగా రూపుదిద్దుకుంటుంది. అదే భగవత్ తత్త్వమవుతుంది. అంటే ఆ మనిషి మహాత్ముడైపోతాడు. అయితే అలా అనుకోవడంతోనే ఇలా మానవత్వం వ్యక్తిలో కనపడిపోదు. ఒకవేళ కనపడినా అది పూర్ణత్వం క్రిందకు రాదు. అందుకే **మనిషైనవాడు గురువును చేరి తనువు, మనస్సు, కాలము, సంపదను అర్పించి పూర్తి శరణాగతి చెందినప్పుడు ఆ వ్యక్తిలోని మానవత్వం పరిమళించి, పూర్ణత్వాన్ని పొందుతుంది.** అదే మహాతత్త్వము! మహాత్ముల చర్యలు గమనిస్తే ప్రతి మహాత్మునిలోనూ మానవత్వం పరిణితి చెంది మహితతత్త్వముగా శోభిల్లుతూ, భక్తులను ప్రభావితం చేస్తుంటుంది.



**అందరూ బాగుండాలి. అదే నిజమైన ప్రార్థన :**

**శ్లో॥ మాతా చ పార్వతీదేవీ పితాదేవో మహేశ్వరః**
**బాంధవాః శివభక్తాశ్చ స్వదేశో భువనత్రయం!**

జగద్గురు శ్రీఆదిశంకరాచార్యులు కాశీలోని అన్నపూర్ణాదేవి ముందు నిలబడి "పార్వతీదేవి! నువ్వే నా తల్లివి. ఆ శివయ్యే నా తండ్రి. పరమాత్ముని భక్తులందరూ నా బంధువులు. ముల్లోకాలు నా స్వస్థానాలే. కావున మాతా అన్నపూర్ణేశ్వరీ! నీవు ఈ ముల్లోకాలలోని భగవద్భక్తులకు అన్నం పెట్టు తల్లీ" అని ప్రార్థిస్తారు. (అందరూ బాగుండాలి అన్నదే మన ప్రార్థన కావాలి).

ఒక సామాన్య వ్యక్తి కాశీలో అన్నపూర్ణమాత ఎదుట నిలిచి ప్రార్థించాల్సి వస్తే, తల్లీ అన్నం పెట్టమ్మా, జీవితంలో తిండికి లోటు రాకుండా చేయి తల్లీ అనిగానీ, తన కుటుంబానికి జీవితాంతం అన్నం పెట్టు తల్లి అనిగానీ ప్రార్థిస్తాడు. భగవత్ తత్త్వాన్ని తనలో నింపుకొని, అదే తానుగా నిలచిన వారు కాబట్టి శంకరులు తనకు కాకుండా, ముల్లోకవాసుల ఆకలికి అన్నం పెట్టమని ప్రార్థించారు. కొందరి గురించి ఆలోచిస్తే అది మానవత్వం! సమస్తజీవరాశి గురించి యోచిస్తే అది దైవత్వం, అది మహాతత్వం! అది మహితతత్త్వం. (మహిని గురించి యోచించే తత్త్వం). వారే మహాత్ములు. ఈ విశ్వాన్ని దత్తత తీసుకున్న తత్త్వమే దత్తాత్రేయ తత్త్వం.

బదరీనందు గల శంకరపీఠాన్ని అధిరోహించిన బ్రహ్మానంద సరస్వతీస్వామివారు చిన్ననాడు ఇల్లు వదలి వెళ్ళేందుకు ఎవరూ అంగీకరించని పరిస్థితి అది. తల్లిదండ్రులు, కుటుంబీకులు ఎంతగానో వారింపజూశారు. ఫలితం లేదు. గ్రామంలోని కుల గురువును పిలిపించారు. ఆయన తన పాండిత్య బలముతో, జీవితానుభవముతో ఎంతగానో నచ్చచెప్ప పూనుకున్నాడు. "బాబూ! నీవు నీ తల్లిదండ్రులకు ఒక్కడివే సంతానము. వారి ఆశలన్నీ నీ మీదనే కదా! వారికి వృద్ధాప్యంలో సేవ చేయుటయే నీ పరమ కర్తవ్యము. అదే ధర్మము కూడా, నీవు ఇల్లు వదలి వెళ్ళి వాళ్ళను అనాథలను చేస్తావా? నీవు మొదట కుటుంబ సంబంధ కర్తవ్యములను నిర్వహించి, వివాహము చేసుకొని, తరువాత సమయం వచ్చినప్పుడు సన్యసించి అరణ్యాలకు వెళ్ళవచ్చు కానీ ఇప్పుడే వెళ్ళుట తగని పని. అసంపూర్ణ జీవనము వలన సాధన జరగదూ అని చెప్తాడు కులగురువుగా ఉన్న పండిత వరేణ్యుడు.

అప్పుడు బాలుడిగా ఉన్న ఆయన తగు సమాధానము చెప్తూ చివరన ఇలా అంటారు. కుటుంబములో ఏ ఒక్కనికైనా తత్త్వజ్ఞానము ప్రాప్తమైతే, ఆ కుటుంబమంతా తరించునని శాస్త్రము

చెప్తున్నది గదా! శాస్త్రములు చెప్పినది నిజమే అయితే భగవత్ సాక్షాత్కారము, బ్రహ్మజ్ఞానము పొందుట వలన నేను నా కుటుంబానికి, అందరికీ శ్రేయస్సు కలిగించిన వాడినే అవుతాను గదా! అన్నాడు.



చివరకు తల్లి అనుమతితో ఆయన అలాగే చేసి, జ్ఞానం సముపార్జించి జగద్గురు స్థానంలో నిలిచి, వారి కుటుంబానికే కాకుండా, సమస్త జనులందరికీ ఆధ్యాత్మిక మార్గదర్శకులై, ఎందరికో శ్రేయోమార్గమును చూపిన వారయ్యారు. శ్రీవెంకయ్యస్వామివారు అప్పుడూ ఇప్పుడూ ఏ ఒక్కని హృదయం దుఃఖభరితమైనా తట్టుకోలేరనేది ఎందరెందరి అనుభవాల్లోనో ప్రత్యక్షంగా కనిపిస్తుంది. అందుకేనేమో కరువు కాటకాలు వచ్చినప్పుడుగానీ, కలరా, మశూచి వంటి మహమ్మారులు గ్రామ గ్రామాలకు ప్రాకి అల్లాడిస్తున్నప్పుడుగానీ, ఎవరూ పిలువకుండానే ఆయా చోట్లకు చేరుకొని ధుని వేస్తూ, తంబుర మీటుతూ జనుల సామూహిక దుష్కర్మను తన తపస్సుతో నాశనం చేస్తూ, వర్షాలు పడేటట్లు చేయడం మహమ్మారులను పారద్రోలడం చేసి జనులను రక్షించడం, ఇలా సాయిబాబా చరిత్రలో కూడా చూడగలం (గోధుమల లీల).

మనిషిలో మానవత్వం చోటు చేసుకోవాలన్నా, మానవత్వం పరిమళించి పూర్ణతత్త్వం (దైవత్వంగా ఎదగడం) పొందాలన్నా మనిషి తన అసలైన లక్ష్యము కొరకు తప్పక **'గురువు'**ను ఆశ్రయించాలి. తన దృష్టి ప్రపంచం వైపు కాకుండా సద్గురువువైపు, భగవంతునివైపు ఉన్నప్పుడు మాత్రమే ఆ సాధకునిలో సత్వగుణము అధికారికమై దయ, కరుణ, ప్రేమ వంటి దైవీగుణాలు మొలకెత్తి మానవత్వంగా రూపుదాలుస్తాయి. అదే మానవత్వం గుర్వనుగ్రహముతో పరిపూర్ణతను సంతరించుకొని సమస్త జీవుల తరింపుకు దోహదమవుతుంది! అందుకే మనం గురువును ఆశ్రయించి, ఆయన బోధనలను ఆచరణతో తీర్చిదిద్దుకోవాలి. ఆ మానవత్వ బీజం సరిగా పెరిగి పుష్పించి ఫలాలు ఇచ్చేలా సత్సంగం అనే కంచె కట్టుకోవాలి. అలా వృద్ధి చెంది పదుగురి శ్రేయస్సును కాంక్షించే మహావృక్షంగా మారుదాం! (నీవు వేల మహావృక్షాలు నాటాలి అని శ్రీసాయిబాబా ఉపాసనీతో అంటారు)

**"మనిషి జీవితం నలగడానికి కాదు ఉన్నది. మనిషి దేవుడై ఈ భూమి మీద వెలగడానికి అది ఉన్నది"**

కనుక జీవితాన్ని చిన్నచూపు చూడగూడదు.

***సంకలనం : గురుకృప***



# అమృతోత్సవం

**"I belong to Baba. Baba belongs to me".** అన్న ఈ ఒక్కటి గుర్తుపెట్టుకుంటే చాలు అంటారు శ్రీబాబూజీ.

గురువుగారు చెప్పినట్లు ఈ ఎరుక నిరంతరం మనలో నిలిస్తే మన జీవనాలలో అమృతోత్సవం. గురువు తమ తత్వాన్ని ప్రతిబింబింపచేస్తూ ప్రకటించిన ఆధ్యాత్మిక సత్యాలు, సూత్రాలు, భావాలు, సులువులు, జ్ఞానసౌరభాలను, ప్రేమ పరిమళాలను మన జీవితాలలో నింపేందుకు వారి దగ్గరకు చేర్చుకున్నారు. వాటిని నిలుపుకునే ప్రయత్నం అనే ఒక్క అడుగే మనవైపు నుండి వేయవలసినది. దీనికి సత్సంగం, స్మరణ, పారాయణలనే ఉపకరణాలనిచ్చి అవి మన జీవనాలను అమృతోత్సవంగా మార్చుతాయనే ఆశ, ఆశయం, ఆకాంక్షలు గల అమృతహృదయుడు – గురువు. మానవ జీవితాల్లో (అమృతము, హాలాహలము) ఆనందం, దుఃఖం, సుఖం, కష్టం రెండూ ఉంటాయి. కానీ మనం తెలిసో తెలియకో హాలాహలం (కష్టాలు, దుఃఖాలు) లేని జీవితాన్ని ఆశిస్తాము. అయితే హాలాహలం తర్వాతే లేదా దాని ద్వారానే అమృతం సాధ్యమవుతుందన్నది సత్యం. మనది ద్వైత జీవితం కాబట్టి ఈ రెండూ తప్పవు. బహుశా అందుకేనేమో హాలాహలాన్ని హరిస్తూ, అమృతాన్ని వర్షిస్తూ, ఆప్యాయతాహలాన్ని చేతపట్టి మన జీవితాలను సారవంతం చేయడానికి గురువు (సార్) మనల్ని తన దగ్గరకు తెచ్చుకున్నారు కనుక అది కరుణానుబంధం. మన జీవితాలలోని సంఘటనలనే మిషలుగా చేసుకొని (కాస్త దగ్గరగా వచ్చారు) ఈ అనంత కాలవాహినిలో బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా, అలుపు కలిగేంత ఆనందంతో, పరవళ్ళు తొక్కే పారవశ్యంతో, **'సారో'**ను ఆనందంగా అనువదించుకునే నైపుణ్యాన్ని అందించిన **'సార్'** సాన్నిధ్యంలో గడిపే అవకాశం లభించింది.

ఒకతను బైబిల్ చదవడం మొదలుపెట్టాడు. అలా చాలా రోజులు చదివాడు. ఓ రోజు ఒక ప్రీస్టు (పురోహితుడు) దగ్గరకొచ్చాడు. "ఏమిటి ఎందుకొచ్చావు" అన్నాడు ప్రీస్టు. "నేనెన్నో సార్లు బైబిల్ చదివాను. నాకేం మంచి జరగలేదు ఎందుకని?" అదీ అతని ప్రశ్న. వెంటనే ప్రీస్టన్నాడు. "నీవు బైబిల్ చదివావు బావుంది మంచిదే. అయితే బైబిల్ నిన్ను చదివిందా? మనం శిలువలోంచి వెళ్ళాం. శిలువ మనలోకి వెళ్ళిందా? నువ్వు బైబిల్ చదివావు. బైబిల్ నిన్ను చదవలేదు. మనం గీతని చదవడంలో గీత మనలోకి పోదు. గీత మన హృదయంలోకి **(అనుభూతిగా)** వెళ్తే మనలో మార్పొస్తుంది. క్రిస్మస్ పండుగ జరుపుకోవటమంటే అది. లేకపోతే అది దండగే. మనం ప్రేమ



అనే కొవ్వొత్తిని వెలిగించడం కాదు. కొంచెమైనా పరిణతి చెంది క్రీస్తులా అవ్వాలి. క్రీస్తుని చూడగల్గిన కన్నంటూ ఉంటే క్రీస్తు చరిత్ర మొత్తం ఆయన కళ్ళలో కనబడుతుంది. అవి మామూలు కళ్ళు కాదు. తన్ను శిలువ వేసిన వ్యక్తిని కూడా తన కలువ కళ్ళతో కౌగిలించుకునే వ్యక్తి ఆయన. కలువకళ్ళతో కౌగిలించుకోవటమెందుకంటే శిలువవేసారు కాబట్టి, తనకి చేతుల్లేవు. కొంతమంది కళ్ళతో కౌగిలించుకుంటారు. ఆయన నిస్సహాయుడు. ఆయన దేహంలో మేకులు కొట్టారు. గుండును గుండెలో దింపిన గాడ్సేని క్షమించిన గుణం గాంధీజీది. "ఓ రామ్! అతన్ని క్షమించు, అతన్ని వదిలేయ్" అని ఒక్క గాంధీజీ మాత్రమే అన్నారు. అందుకే గాంధీజీని **'మహాత్మా'** అన్నారు రవీంద్రనాథ్ ఠాగూర్. **(జయంతి ఉత్సవ పరమార్థం ఇది).** క్రీస్తు అన్న పేరు కూడా మామూలు పేరు కాదు. పిలువగానే అభయాన్నిచ్చే శుభనామం".

ఈ మధ్య గురువారంనాడు విన్న పాట గుర్తుకు వస్తుంది. ఓ ప్రసిద్ధ సినీరచయిత శిరిడీసాయిపై వ్రాసారు. ఇపుడు పాట గురించి చెప్పుకోవటం సందర్భోచితం. కాస్త యమకము, శ్లేష వాడుతూ ఆయన **"గురువారమ్ము నేడు. గురువా రమ్ము తోడు"** అన్నారు. **గురువా రమ్ము తోడు** అన్న పదాన్నక్కడ విరిచాడు. అది యమకం. ఇక్కడ **రమ్ము తోడులో** సమస్య ఎక్కడొస్తుందంటే గురువా రమ్ము తోడు అంటున్నారంటే ఆయన తోడురాని వ్యక్తి అనా మీ అభిప్రాయం? అలా అయినపుడే కదా నా వెంట రండి అని ఆయన్ని అడిగేది. ఇపుడు మీ వెంట ఇంకో వ్యక్తి నడుచుకుంటూ వస్తున్నపుడు అతన్ని **'రండి'** అని పిలుస్తారా మీరు? నా వెంట రండి అని ఎప్పుడు అంటారు? ఆయన మీ వెంట రాకుండా వెనుక నిలబడి పోయినపుడు! 'గురువా రమ్ము తోడు' అనడంలో ఆయన మన వెంట రాని వ్యక్తి అన్న అర్థం అందులో నిబిడీకృతమై ఉందనుకుంటాను. కానీ, **ఆయనకు మనకి తోడుగా తిరగడమే పని.** వేరే ఏ పనీ లేదు. కాబట్టి ఆ పదాన్ని ఇంకో రకంగా విరిస్తే సరిపోతుంది. కాస్త ప్రాసలో తేడా వచ్చినప్పటికీ కూడా గురువా రమ్ముతోడు అనడం కన్నా **"గురువువారము మేము"** అంటే సరిపోతుంది. మేము ఆయనకు చెందినవాళ్ళం. మేములో అంత్యప్రాసలో అచ్చుప్రాస ఉంది. హల్లు లేదుగానీ, రెండు 'ఉ'కారాంతపదాలు నేడు, మేము ఉన్నాయి. ఇక్కడ ఏత్వం. అచ్చులో ప్రాస ఉంది. 'గురువు వారమ్ము'లో సమస్య ఎక్కడ పరిష్కరించబడుతుందంటే మేము ఆయనకి చెందినవాళ్ళం అంటే సమస్య ఎగిరిపోతుంది.

మీరు రోడ్డు మీద పోతుంటే రాత్రిపూట పోలీసు పట్టుకుంటాడు. మీకు డిఐజి తెలుసనుకోండి. 'నేను డిఐజి స్నేహితుడిని' అంటే పోలీసు మిమ్మల్ని వదిలేస్తాడు, అంతే. ఒక బంధువు



దగ్గరకెళ్లామనుకోండి, గేటు దగ్గర నన్ను ఆపేస్తారు. అపుడు నేను ఆయన బంధువుని అంటే **'లోపలికెళ్ళు'** అంటారు. **'ఆయన'** తాలూకు వాడిని అంటే మాయ వదిలేస్తుంది. కాబట్టి మనం **'ఆయన వాళ్ళమ'**న్న సంగతి ఆయనకు తెలుసు. 'అతను మా అబ్బాయి' అంటాడు. దానికేమీ సమస్య ఉండదు. **మనం ఆయన సంబంధీకులం అని ఆయన ఎప్పుడూ అంటుంటాడు. మనమే మనని ఆయన సంబంధీకులం అని అనుకోము.** ఆయన 'వీడు మా అబ్బాయి' అన్నా, వీడు 'ఆయన మా నాన్న' అనడు. వీడు కాస్త గర్వంతో ఉంటాడు. పాతసినిమాల్లో చూపిస్తారు కదా, కొడుకు తండ్రిపై అలిగి బైటికెళ్తాడు కదా! ఆయనెవరంటే 'తెలీదు' అంటాడు. అది సరిదిద్దుకొని మేము ఆయన వాళ్ళము అని అనుకుంటే. **గురువారమ్ము నేడు, గురువువారమ్ము మేము** అనుకుంటే ఈ సమస్యలు ఏవీ రావనుకుంటాను. ఏ సమస్య వచ్చినా సరే ఒకటే ఔషధం. **ఆయన సంబంధీకులం మేము అనుకుంటే సరి!** ఎందుకు? మనకి సమస్యను సృష్టించిన ఆయనకు మనం వట్టి **'వారమ్ము'** కాదు స్వయానా **ఆయన పిల్లలం.**

సంబంధం అనే మాటంటూ మనం వాడితే మనమంతా సంబంధీకులమే, మినహాయింపు లేదు. విశ్వమంతా అతిసూక్ష్మమైన సంబంధాలతో సాగే వ్యాపారం కదా! కాబట్టి ప్రతి మనిషి ప్రపంచంలోని వేరే మనిషితో సంబంధించి ఉన్నాడు. అందుకే ఎవర్నీ ద్వేషించకూడదు. బుద్ధుడి ప్రేమ అక్కడి నుంచి వస్తుంది. ఎవరినైనా ద్వేషించడం చాలా కష్టం. ఈ మాయవల్ల మనకివన్నీ అర్థం కాక గందరగోళం. ఆయన పద్ధతులు మనకర్థం కానీ, కాకపోనీ మనలను ఆయన ప్రేమిస్తున్నాడన్న ఒక్క వాస్తవం చాలనుకుంటాను. మీ కోర్కెలు నెరవేరడం, దుఃఖం అదృశ్యమవడాలతో సంబంధం లేకుండా దైవాన్ని ప్రేమించాలి. తల్లి ఉందనుకోండి, మీరు పరీక్షలో ఉత్తీర్ణులవ్వాలని ఆమెకుండదా? మీరు ఉత్తీర్ణులు కాకపోతే మీ అమ్మ మిమ్మల్ని ప్రేమించడం మానేస్తుందా? అమ్మకి మీపట్ల ఉన్న ప్రేమకీ, మీకు పరీక్షల్లో తక్కువ మార్కులు రావడానికి సంబంధం లేదు. అదే విధంగా **భగవంతుడిపైన మీకుండే ప్రేమ వీటితో సంబంధం లేకుండా ఉండాలి.** మీ వైఫల్యాలతో, విజయాలతో దానికెటువంటి సంబంధమూ ఉండదు కదా! ఒక వ్యక్తి నీ వ్యక్తి అనుకున్నపుడు మీకు తెలీదా వాళ్ళేం చేస్తారో, ఎట్లా ఉంటారో, బాబు ఇంటికి వస్తాడు. "ఏమిటిరా! నీ ముఖం అలా ఉంది ఏమైంది" అంటుంది తల్లి. తల్లికి బిడ్డ తనకి చెందినవాడన్న భావన ఉండటం వల్ల చిన్న విషయాన్ని కూడా ఫీలవుతుంది కదా. **ఆయన నీకు చెందినవాడు. నువ్వు ఆయనకి చెందినవాడివి.** అన్నిటినీ ఆనందించు. ఆరోపణలు వద్దు, ఉత్తరాలు వద్దు, ఏమీ వద్దు. కేవలం మౌనం.

**– సంకలనం : గురుకృప**

# మందడుగు-ముందడుగు



"మాస్టరుగారు మా ఇలువేల్పు. మా చిన్నబ్బాయి జబ్బుతో ఆ మిషగా మాకు మాస్టరుగారి నీడ దొరికింది. ఆ తరువాత మీ గూర్చి మీరు అశ్రద్ధ చేయద్దు అని మా ఆవిడ పదేపదే చెప్పడంతో, నేను కూడా వారి దగ్గర మందు మొదలు పెట్టాను. ఈ మధ్య మా మరదలు వచ్చింది. ఆవిడ అనారోగ్యాన్ని గురించి కూడా మాస్టరుగారినే సంప్రదించాం. ఈ మధ్యనే తనకు కూడా మాస్టరుగారి మందే కావాలని, వినికిడివల్ల విశ్వాసం పెరుగుతోందని మా నాన్నగారు ఉత్తరం వ్రాశారు. ఈ విధంగా మేమూ, మా కుటుంబం, మా వంశం, బంధుమిత్రులు – అందరం మాస్టరుగారి మార్గంలోకి చేరుకున్నాం. ఆ బాటనే నడుస్తున్నాం."

తమకు సన్నిహితుడైన ఆ వ్యక్తి మాటలు విని, కృష్ణస్వామి చిన్నగా నవ్వారు. 'ఏమి అలా నవ్వుతున్నారు?' అని అడిగాడు ఆయన. "మీరు మాస్టరుగారి మార్గానికి చేరుకున్నాం, నడుస్తున్నాం అన్నారు కదా, అందుకు నవ్వొచ్చింది". తానన్న దానిలో తప్పేమిటో అన్నట్టు చూశాడాయన.

కృష్ణస్వామి ఇలా వివరించారు "మీరు చెప్పిన సన్నివేశాల్లో మీరు మాస్టరుగారిని ఉపయోగించు కుంటున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది, సంతోషం–తప్పులేదు. మనకు ఉపయోగపడడానికే ఆయన ఉన్నారు కనుక. కానీ ఆయన మార్గంలో నడుస్తున్నాం అన్నారు మీరు, నడిస్తే అంతకన్న కావలసింది లేదు. **పదిమందికి ఉపయోగపడగలిగినప్పుడు మాత్రమే ఆయన మార్గంలో మనం నడుస్తున్నట్లు అవుతుంది.** అంతవరకు వారిని ఉపయోగించుకుంటున్నాం అని మాత్రం చెప్పవచ్చు. ఉపయోగం పొందే స్థితి నుండి  ఉపదేశం పొందే స్థితికి, మందు అడిగే స్థితి నుండి ముందడుగు వేసే స్థితికి మనం అలా ఎదగాలి. అలా ఎదిగినప్పుడు మాత్రమే ఆయన మార్గం మనకు చేరువౌతుంది."

ఆ వ్యక్తి కొంచెం సిగ్గుపడుతూ "మీరన్నది నిజమే. మీరన్నట్టు ఆయన నుండి ఉపయోగం పొందే స్థితి నుండి ఆయనలా ఉపయోగపడే స్థితికి ఎదగాలనీ, ఆయన మార్గాన నడిచే మంచిరోజులు రావాలని కోరుకుంటున్నాను" అన్నాడు.

"వచ్చాయి కాబట్టే కృష్ణస్వామి గారి నుండి ఈ హెచ్చరిక మీకు అంది ఉంటుంది" అన్నాను నేను.

**నమ్ముకుంటున్నామా? అమ్ముకుంటున్నామా? :** మాస్టరుగారి ఆశీస్సులతో ఒక వ్యాపారసంస్థను పెట్టి దినదిన ప్రవర్ధమానంగా నడుపుతున్న వ్యక్తి ఒకరు ఒకసారి కృష్ణస్వామిని కలిసి ఇలా అన్నారు. "మాస్టరుగారి దయవల్ల మా వ్యాపారం నిరాఘాటంగా సాగుతోంది. ఎక్కడకు వెళ్ళినా ప్రతి సంస్థలోనూ



మాస్టరుగారి శిష్యులు, అభిమానులు ఉంటారు కదా! వాళ్ళందరూ ప్రేమతో సహకరిస్తున్నారు. మా ఖాతాదారుల్లో కూడా ఎక్కువ మంది మాస్టరుగారిని బాగా తెలిసున్నవారే. ఆ అభిమానంతోనే మా సంస్థకు అలవాటుపడ్డారు. ఆయన దయవల్ల చీకూచింతా లేకుండా బండి నడిచిపోతోంది".

కొంచెం ఆగి, కృష్ణస్వామి ఇలా అడిగారు. "పూర్వం మీరు డిస్పెన్సరీలో సేవ చేస్తూ కనపడేవారు ఈ మధ్య?" అతనందుకొని ఇలా అన్నాడు "అవ్వడం లేదండీ. వ్యాపారం పని సరిపోతోంది".

"సాయంకాలం ఉపన్యాస సమయంలో కూడా.....?

"కుదరడం లేదండి, అప్పటికీ ఎంతో ప్రయత్నిస్తున్నాను"

కృష్ణస్వామి ఇలా అన్నారు "నాకు అప్పుడప్పుడు ఒక అనుమానం వస్తూ ఉంటుంది. మాస్టరుగారిని మనం నమ్ముకుంటున్నామా, లేక అమ్ముకుంటున్నామా అని. ఆయన పేరును ఉపయోగించుకోవడంలో ఉన్న కుతూహలం ఆయన చూపిస్తున్న మార్గాన నడవడంలో కనపడనప్పుడల్లా నాకీ సందేహం వస్తూ ఉంటుంది.

ఆయన కొంచెం తలవంచుకున్నాడు. కృష్ణస్వామి ఇంకా ఇలా అన్నారు "మాస్టరుగారిని ఉపయోగించుకోవడం తప్పు కాదు. కానీ మాస్టరుగారిలా మనం నలుగురికి ఉపయోగపడడం జరుగుతున్నప్పుడు మాత్రమే ఆ ఉపయోగాన్ని స్వీకరించడానికి అర్హులమౌతాము లేనప్పుడు మనం అవకాశవాదులమే." ఆ ఆలోచనలో పడినట్టయి, అతని కన్నులు కొద్దిగా చెమర్చాయి. కొంచెం గద్గదమైన కంఠంతో ఇలా అన్నారు "నిజమే, మీరన్నది వెనక్కి తిరిగి చూసుకుంటే, నేను అవకాశవాదినేమో అనిపిస్తోంది. దారి దొరికేటంత వరకు సేవలో పాల్గొన్నాను. ఉపన్యాసాలకు శ్రద్ధగా వచ్చాను. కానీ చిత్రం! ఆయన దయవల్ల దారి దొరికింది. ఈ సంస్థ పెట్టాను. బండి నడుస్తోంది. నాకు తెలియకుండా నేను మాస్టరుగారికి దూరమయ్యానని ఇప్పుడు మీ మాటల వల్ల బోధపడింది. అవసరం తీరేటప్పటికీ మనిషి మనస్సు ఎందుకిలా చిత్రంగా ప్రవరిస్తుందో!" అతని కళ్ళ నుండి నీళ్ళు జలజలా రాలాయి.

కృష్ణస్వామి "కలత పడకండి. కర్తవ్యాన్ని గమనించండి. మిమ్మల్ని కర్తవ్యోన్ముఖుల్ని చేసేటందుకే పని కట్టుకుని హెచ్చరించాను. మీకు తెలియకుండానే జారిపోతున్నారు గనుక. సహచరుడిగా తెలియజెప్పాను. మనకి మనం చెప్పుకోకపోతే ఇంకెవరు చెప్పుతారు? నాకు మీరు చెప్పాలి, మీకు నేను చెప్పాలి. ఒకరినొకరు హెచ్చరించుకొంటూ మాస్టరుగారితో కలిసి నడవాలి" అనే వాక్యాలతో



కన్నీళ్ళు తుడిచారు.

"వస్తాను సార్. రేపట్నుంచి ఇదివరకు లాగానే ప్రవర్తిస్తాను. మీరే చూస్తారుగా" అంటూ సెలవు కోరాడు.

కృష్ణస్వామి ఇలా అన్నారు "మీరు చేస్తున్న పనిని మానుకుని సేవలో పాల్గొనకండి. పనిని సర్దుబాటు చేసుకునేటందుకు వీలయితేనే చూడండి. లేనప్పుడు **మీరు చేస్తున్న పనినే మాస్టరుగారి వెలుగులో చేయండి.** ఆయన వెలుగును విడవకుండా ఉండడమే మనకు ముఖ్యం."

"ఫరవాలేదులెండి వచ్చేస్తాను. మాస్టరుగారి సేవలో ఎంతో కొంతసేపు పాలుపంచుకుంటేనే మీరన్నట్టు మిగిలిన వృత్తి వ్యాపారాలు ఆయన వెలుగులో నిర్వహించడానికి వీలవుతుంది అని నాకనిపిస్తోంది. లేకపోతే ఇప్పుడు వచ్చినట్టే ఏమరుపాటు వచ్చేయగలదు, వస్తాను" అంటూ తృప్తిగా సెలవు తీసుకున్నాడు.

***– సేకరణ : మాటలు–మంత్రాలు***

## బాబాను ప్రార్థించేటప్పుడు మనసులో ఎలాంటి భావం ఉండాలి?

అందరిలోనూ, అన్ని జీవుల్లోనూ ఉండేటువంటి బాబాను మనం గుర్తించడమే నిజమైన ప్రేయర్. మనం పారాయణ చేస్తున్నాం. పారాయణలో ఏం చేస్తున్నాం? బాబా యొక్క లీలలు స్మరణ చేస్తున్నాం. బాబా ప్రతి లీలలో మనకు చెప్పిందేమిటంటే, "అన్ని జీవుల్లోనూ తానే ఉన్నాను, అంతటా తానే ఉన్నాను" అని. ప్రతి లీలలోనూ ఇదే, ఆ మడత మీదనే ఇస్త్రీ చేస్తూ ఉన్నారాయన. **"అన్ని జీవుల్లో ఉండేటువంటిది నేనేనూ"** అని చెప్తూ ఉన్నారాయన.

బాబా చరిత్ర పారాయణ చేస్తూ పోతుంటే మన మనసులో ఆ భావం మరీ మరీ ధృడమవుతూ పోతుంటుంది, బలపడుతూ పోతుంటుంది. **That itself is meditation**. అదే ధ్యానం. అదైన తరువాత, ఆ భావంతో ఆయనను చూడటం.

బాబా ఫోటో వైపు చూస్తే అన్ని జీవుల్లోనూ ఉండేటువంటిది ఆయన అనేటువంటి స్ఫురణ మనకి రావాలి. అట్లా చూస్తూ ఉంటే చాలు, **That is prayer**. అది ప్రార్థన. అట్లా మనం



గుర్తుపెట్టుకోవడానికి ఏవి దోహదం చేస్తే అవంతా ప్రేయరే. అది కాకుండా ఇంకేది ప్రేయర్ కాదు. ఎందుకంటే మనకి ప్రొటెక్షన్ వచ్చేదీ అట్లాగే. మన గోల్ అదే. బాబా యొక్క స్థితీ అదే. ఆయన తన జీవితమంతా, మొత్తం మీద మనకి చెప్పదలుచుకున్నటువంటి సందేశం అదే. "అన్ని జీవుల్లోనూ ఉండే చైతన్యాన్ని గుర్తించు, అంతా ఉండేటువంటిది ఒక్కటే" అన్నారు. **భావించమని చెప్పడం లేదాయన, గుర్తించమని చెప్తున్నారు.** గుర్తించడం మొదలుపెట్టామంటే మన ఎక్స్‌పీరియెన్స్ మనకే వస్తుంది. మన మనసులో ఒక ఫీలింగ్ గాని వస్తే ఆటోమేటిక్‌గా బయట ఉండే జీవులు రియాక్ట్ అవడం మొదలుపెడతాయి. **We feel one with the whole nature.**

ఆయన ఆ స్థితితో ఉన్నారు. ఎంతవరకు? ప్రాణులతోనే కాదు, మనం ప్రాణం లేవు అనుకునేటువంటి నిర్జీవ పదార్థంతో సహా. అందుకని ఆయన చెప్పిన మాటలు అట్లాగే ఉంటాయి. ఇప్పుడు ఈ చెయ్యి ఉంది... ఈ చెయ్యి ఇట్లా పెట్టాలనుకుంటే ఇట్లా పెడతాను, అట్లా పెట్టాలనుకుంటే అట్లా పెడతాను. నా ఇష్టం. నా శరీరంలో భాగమిది. లేదూ, మిమ్మల్ని అడుగుతాను. భానుమూర్తిగారూ, ఇటొచ్చి కూర్చోండి అంటే, మీరు కూర్చుంటారు. **I can communicate with you.** మనద్దరికీ ఆల్రెడి ఒక రిలేషన్‌షిప్ ఉంది. అట్లా నేను మిమ్మల్ని కంట్రోల్ చెయ్యగలను. రెండు నిమిషాల్లో కంట్రోల్ చెయ్యగలను. బాబా జీవమున్న పదార్థాన్ని, నిర్జీవమైన పదార్థాన్నీ రెండింటినీ అట్లాగే కంట్రోల్ చెయ్యగలిగారు.

మసీదులో పైన ఇటుక రాలి పడబోతున్నది, **"ఆగు"** అంటే ఇటుక అక్కడ అలా ఆగుతుందంతే. మనిషి విన్నట్టుగా!ఎందుకని? అంత **oneness** ఉంది ఆయనకు నేచర్‌తో, మనకు మనతోనే ఉండదు **first thing.** ఒకవేళ మనతో ఉన్నా, మనకున్న చుట్టుప్రక్కల పదిమందితో ఉంటుంది. **మాగ్జిమమ్ అయిదుమంది వింటారు, పదిమంది వింటారు మనం చెప్పినట్టుగా వినేవాళ్ళు.** కానీ మొత్తం సృష్టి సృష్టే ఆయన మాట వింటుంది. వర్షం **'ఆగు'** అంటే ఆగుతుంది. **'రా'** అంటే వస్తుంది. 'అగ్ని'ని **'తగ్గు'** అంటే తగ్గుతుంది, **'పెరుగు'** అంటే పెరుగుతుంది. కానీ అంతవరకూ కాకపోయినా ఆ **oneness**ని మనం గుర్తిస్తూ ఉంటే చాలు, మనకు తెలియకుండా మన **subconscious** దానితో ట్యూన్ అవుతుంది. దాంతో ట్యూన్ అయిందీ అనంటే అన్నీ అట్లాగే అవి సమకూరిపోతుంటాయి. అది కరెక్ట్ ప్రేయర్.

***– శ్రీ బాబూజీ***

# అనన్య భక్తికి వరిష్ట ఆచార్యులు శ్రీబాబూజీ



**"నన్ను ఆనంద స్వరూపంగా ధ్యానించు. నీకది సాధ్యపడకపోతే నా రూపాన్ని ధ్యానించు"** అన్నారు శ్రీసాయిబాబా. ఆ ఆనందస్వరూపుని స్వస్వరూపం అందరూ దర్శించగలిగిందా? సాధ్యమా అంటే – ఒక్క అడుగు వేస్తే సాధ్యమవ్వచ్చునేమో! మరల అది సాధ్యమయ్యేలోపు వెనకడుగు వేయకుండా బాబానే ఆయన రూపాన్ని ధ్యానించమని ఒక సులభమైన ఉపాయాన్ని తెలియజెప్పారు. బాబా అంటే పోనీ ఒక రూపానికి పరిమితం చేద్దామా అంటే జడము, అజడము అయిన జీవులలో కూడా తానే ఉన్నానని నిదర్శనాపూర్వకంగా దర్శింపజేసిన సమర్థ సద్గురువు(దైవం)…. ఇంతకు మించిన ఉపమానమేదీ లేక ఇక్కడే ఆగిపోతున్నాం. ఇంతకూ బాబా చెప్పినదేమిటి? చేసినదేమిటి? **"నీవు చూచేదంతా కలిపితే నేను!" అంటూనే "ఎవరైతే ఈ మూడున్నర మూరల దేహాన్నే 'సాయి' అని అనుకుంటారో, వారసలు 'సాయి'ని చూడనట్లే!"** అని ఈ చరాచర జగత్తులోనూ తానే ఉన్నానని, తాను అపరిమితుడనని స్పష్టం చేశారు శ్రీసాయిబాబా. అక్కడితో ఆగిందా ఆ లీలా మానుషుని వినోదమంటే – కట్టె విసిరి కుక్కను కొడితే తన వీపున ఆ దెబ్బలు చూపారు, పుల్ల పెరుగును తినటాన్ని వారించడానికై పిల్లిలా తానే దెబ్బలు తిన్నానని చెప్పారు. టాంగా నడిపే వాడయ్యారు, బిడ్డల రక్షణకై కావలి కాస్తానని కాచుకున్నారు, జన్మజన్మలకు తోడున్నట్లు తెలియజెప్పారు. **నిజానికి శ్రీసాయి చెప్పింది తక్కువ – నిదర్శనాపూర్వకంగా దర్శింపజేసిందే ఎక్కువ.** బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి – బ్రహ్మమును అనుభవించిన వాడు బ్రహ్మమే అవుతాడన్న మండకోపనిషత్ వాక్యము, హరి…హరి… అంటూ హరినే అయ్యానన్న బాబా వాక్యముతో సర్వజీవులలో తానే ఉండి, బ్రహ్మముగా చరించి వారి ఆచరణతో మార్గదర్శనం చేసే క్రమంలో **"ఈ ప్రపంచము మన మధ్య బేధమనే అడ్డుగోడను నిలుపుతున్నది. ఆ గోడను కూలదోస్తే చాలు. అప్పుడు మన మధ్య మార్గమేర్పడును. మనం దగ్గరగా ఉంటాము".** అని విస్పష్టంగా దారి కూడా చూపారు శ్రీసాయి. ఇలా మనం ఉదహరించుకున్న విషయాలనన్నింటిని క్రోడీకరించి చూసుకుంటే శృతి, స్మృతి, పురాణేతి, ఉపనిషత్తుల సారమంతా ఒక్క తావున చేర్చి పూజ్య గురుదేవులు సమగ్రమైన శ్రీసాయితత్త్వాన్ని ఒక్క అంశంతో తెలియజెప్పారు. **"సర్వత్రా సర్వజీవులలోను ప్రకాశించే చైతన్యాన్ని మనచే దర్శింపజేయడమే శ్రీసాయి ద్వారా ప్రకటమైన లీలా ప్రబోధాల యొక్క పరమార్థం. ఆ సత్యాన్ని దర్శించడమే సాయిభక్తుల**



**సాధన లక్ష్యం!"** అని, మనిషి దైవంగా ఎదగడమనే శ్రీసాయి అనంతప్రేమసారాన్ని అలతి పదాల్లో ప్రబోధించారు పూజ్య గురుదేవులు శ్రీబాబూజీ. మరి మనమూ ఈ సత్యాన్ని దర్శించగలమా! ఏది మార్గం - మహాత్ముల పథమే మార్గం. ఆ మహితాత్ముల అడుగులే మనకు అడుగుజాడలు - భవసాగరాన్ని దాటించి వారి చరణాలకు చేర్చే అనుగ్రహ ఓడలు.

**వారి జీవితమే సాధకులకు పాఠం : "భగవంతుడు శ్రీసాయిబాబా రూపంలో వచ్చాడా లేదా అని నాకు చింత లేదు. నాకు శ్రీసాయియే భగవంతుడు!"** అంటారు శ్రీబాబూజీ. శ్వాస తీసుకుంటున్నా అది కేవలం శ్రీసాయి వరప్రసాదమేనన్న ఆ సద్గురుచంద్రుని భావన, నీరు తాగుతున్నా, ఆహారం సేవిస్తున్నా, లేచినా, కూర్చున్నా, తలచినా, పిలిచినా, నూత్న వస్తువు కొన్నా, కొత్త పని ప్రారంభించినా... ఇలా అనుక్షణమూ శ్రీసాయితోనే లయించిన జీవిత గమనం ఆ మహితాత్మునిది. 'అనన్య ప్రేమ-భక్తి!' అన్న నారదభక్తి సూత్రమునకు వారి జీవితమే ఒక సజీవ వ్యాఖ్యానంగా విలసిల్లింది. వారి జీవనమును పరికిస్తే మరో భక్తి సూత్రము స్పష్టంగా గోచరిస్తుంది. "సర్వదా సర్వభావేన నిశ్చింతితైః భగవానేవ భజనీయః" సర్వకాల సర్వావస్థలయందు "నిశ్చింతుడై" భగవంతుని (సాయి) భజించవలెనన్న నారద మహర్షి మాటకు బాట వారి సాయిభక్తి. వారిది సజీవ ప్రమాణము. ఎంత స్పష్టమైన విధానమో చూడండి. **"సాయిభక్తుడికి కీడు జరగడం ఏంటయ్యా, నాన్సెన్స్ కాకపోతే అసలు?** **అది** absurd, it's a pardox ! **సాయిభక్తుడికి కీడు జరిగింది అనడం. సాయిభక్తుడికి కీడు జరుగదు, జరిగే క్వశ్చన్ లేదు".** ఇదీ నిశ్చింత అంటే. సద్గురువంటే తాను పైన ఉండి రమ్మని పిలుపునిచ్చేవాడు కాదు, చేయిపట్టి నడిపించేవాడు కదా! సర్వజీవులలో ఉన్న శ్రీసాయి అనే చైతన్యాన్ని తాను దర్శించి మనచే దర్శింపజేసే లక్ష్యాన్ని ఎలా చేరాలో జీవించి చూపారు వారు. మీరు దర్శనమివ్వడానికి వేదికను అలంకరించినపుడు మీకేమనిపిస్తుందన్న పాశ్చాత్య భక్తునితో **"ఎవరికో దర్శనమిచ్చేందుకు నేను సత్సంగ మందిరానికి రావడం లేదు! నేనొచ్చేది దర్శనం చేసుకునేందుకు. అయినా, ఒకరికి దర్శనమిచ్చేందుకు మనమెంతటి వారం? మనందరికీ సర్వదా బాబానే దర్శనీయుడు. అంతమంది సాయిభక్తుల ముందు కూర్చున్నపుడంతా నాకు "సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్..." అన్న వేదసూక్తం స్ఫురణకు వస్తుంది. సహస్ర శిరస్సులతో, సహస్ర నేత్రాలతో శ్రీసాయి తన విరాట్ స్వరూపంతో దర్శనమిచ్చి, ప్రసన్న దృష్టితో చూస్తున్నారనిపిస్తుంది".** "ఈశా



వాస్యమిదం సర్వం యత్ కించ జగత్యాం జగత్” “ప్రపంచంలో కదులుతున్నటువంటి ఎంత చిన్నదైనా ఆ సర్వమూ ఈశ్వరునిచే ఆవరింపబడియున్నది అంటుంది” ఈశావాస్యోపనిషత్తు. మహాత్ముల ఆచరణ ఈశోపనిషత్‌కు వ్యాఖ్యానమా అన్నట్లు–కనిపించే ప్రతి జీవినీ ఈశ్వరునిగా దర్శించడం జరుగుతుంది. కనీసం ఒక్క రూపానికైనా పరిమితమై తనువు, మనసులన్నీ అర్పించి అనన్య శరణాగతి గావిస్తే కదా ఆ అడ్డుగోడ కూలేది. భగవంతుని రూపం సాక్షాత్కరించి సర్వజీవులలోనూ ఆ చైతన్యాన్ని దర్శించగలిగేది.

**ఏది మార్గం...జరిగేనా ఈ పరిణామం... :** “ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనమ్” ఉపాసకుల సౌకర్యం కోసమే ఆ పరబ్రహ్మ తత్త్వానికి రూపకల్పన చేయబడింది అని శాస్త్రం అంటూ శ్రీబాబూజీ సాయిభక్తి సాధన రహస్యంలో పరశురామ కల్పం వంటి గ్రంథాలను గుర్తుచేశారు. ఉపాసనా కార్యంగా ఒక లక్ష్యంతో చేసే పూజావిధులు మనలను తప్పక ముందడుగు వేయించగలవు – తంతుగా అవి మారనంత వరకు. **“సద్గురు దివ్య పాదాలను హృదయంలో ప్రతిష్ఠించుకుని, భక్తిరాగరంజితమైన మనస్సనే కుంకుమతో ఆ పాదాలకు పారాణి చేసుకునే”** పరాయణత్వంతో కనుక గురువును పూజిస్తే ఎలా ఉంటుందో చూద్దాం. బాబూరామ్ మహారాజ్‌గా ప్రేమగా పిలుచుకునే శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష శిష్యులు స్వామి ప్రేమానంద తమ జీవితాన్ని వారి గురుచరణాలకే అంకితం చేశారు. వారు రామకృష్ణ మఠ సర్వాధ్యక్షులుగా ఉండి దేహం వదిలివేశాక గమనిస్తే ఒక భగవద్గీత, ఒక జతబట్టలు, ఒక జత చెప్పులు మాత్రమే ఉన్నాయి. సంఘ సర్వాధ్యక్షులుగా ఉండి కూడా ఇంతటి నిరాడంబర జీవితం సాగించిన ఆ సద్భక్తునికి ఎదురైన ఒక సంఘటన – ఒకనాడు వారి జీర్ణమయిన జతబట్టల స్థానంలో కొత్తబట్టలు తెప్పించుకున్నారు. ఆ రోజు రాత్రి నిద్రకుపక్రమించగానే శ్రీరామకృష్ణుల దర్శనమయ్యింది. “బాబూరామ్! నువ్వు నన్ను మరచిపోయావు. నీకు మాత్రమే బట్టలు తెప్పించుకున్నావు” అని అన్నారు ఠాకూర్. బాబూరామ్ మహారాజ్‌కు ఒక్కసారిగా కించగా అనిపించింది. అక్కడ ఉన్న ఒక సన్యాస శిష్యుని వెంటనే పిలిచి శ్రీరామకృష్ణుల విగ్రహానికి తొడిగి ఉన్న బట్టలను చూసి రమ్మన్నారు. తీరా శ్రీరామకృష్ణుల బట్టలలో ఒక చిరుగు కన్పించింది. వెంటనే నూత్న వస్త్రాలను ధరింపజేశారు శ్రీరామకృష్ణులకు. సగుణోపాసన సాధకుని ఏ స్థితికి తీసుకు వెళ్ళగలదో అవగతమవుతోంది కదా! మా గురుదేవులు శ్రీబాబూజీ, శిరిడీ చేరిన గురుబంధువులు శ్రీసాయి దర్శనం చేసుకోకుండా వారి సాన్నిధ్యాన్ని చేరితే వెంటనే వారిని బాబా దర్శనం చేసుకొమ్మని



సూచించేవారు. శ్రీసాయిని దర్శనం చేసుకోకుండా వచ్చిన వారిని వారు గుర్తించే వారంటే ఇక వారి దివ్యత్వాన్ని - సాయినాథోపాసన వారిని ఏ ఉన్నత స్థితికి చేర్చిందో స్పష్టం చేస్తోంది.

అనంతమైన శ్రీసాయి సగుణ స్వరూపం ఓ ఎత్తయితే పూజ్య గురుదేవులు శ్రీసాయిని చూసే క్షణాలు అంతులేని అన్వేషణను నింపుతాయి. ఏ ఉపనిషదాది భాష్యాలకూ అందనిది ఆ దర్శనం. చరాచర విశ్వమంతా ఒక్క రూపంలో నిండితే - ఆ చరాచర విశ్వాన్ని కేవలం వారి కంటి కనుపాపతో దర్శిస్తున్నట్లుగా తోచేది వారి దర్శనం. వారి దర్శనం ఆనంద మనోల్లతలను, అనుగ్రహసుమాలను పూయిస్తే, వారు బాబాను దర్శించే క్షణాలను ఆస్వాదిస్తే సాధనా ప్రస్థాన అత్యున్నత శిఖరపు అంచులను తాకినట్లుగా తోచేది.

**ప్రకృతి ప్రేమ - ఆకృతీ ప్రేమే:** మనలో, మనతో ఉంటూనే 'దైవత్వాన్ని' పొంది, దర్శింప చేయడం - ఎలా? వారు చెప్పిన మాటల్లోనే ఆధ్యాత్మికత మొత్తాన్ని కేవలం రెండు మాటల్లో నిర్వచిస్తే అది **"ప్రేమను పొందడం - ప్రేమను పంచడం"** అంటారు వారు. ఎంతగా శ్రీసాయితో వారు పరమ ప్రేమలో నిలిచిపోయారంటే అమ్మగారు, కొందరు సన్నిహిత గురుబంధువులు స్కూల్ నిర్వహణా కార్యాలకై ఇతర ప్రాంతాలకు వెళ్ళి కొన్ని రోజులు తరవాత తిరిగి వచ్చి చూస్తే వారి కోసం ఉంచిన ఆహార పదార్థాలు, పండ్లు కూడా స్వీకరించక అదే (ప్రేమైక) స్థితిలో ఉండిపోయేవారంటే మనం ఆ మహితాత్ముని స్థితిని అర్థం చేసుకోవచ్చు. అలనాడు నారద మహర్షి బృందావనంలో సంచరిస్తూ ఉంటే గోపకాంతలు యోగ సాధనలు చేస్తూ కన్పించారట. ఎప్పుడూ కృష్ణుని అనంత ప్రేమ స్ఫురణలో ఓలలాడేవారు, ఇలాంటి సాధనలలో ఉండటం చూసి అడిగారట మహర్షి - మీకు ఏమయింది, ఏం పొందాలని ఈ సాధనలు? మీరు ఆ పరమాత్మనే సాధించుకున్నారు కదా అని! అవును మహర్షి! అందువల్లనే ఈ ఇబ్బందులన్నీ. ప్రొద్దున పాలు పితికి గిన్నెలో పట్టానా? అంతలోనే బాలకృష్ణుడు పాలు కావాలని మారాం చేశాడని భావించి పొరపాటున ఆ గిన్నెను ఒలికించాను, అని ఒకరంటే! తీసిన వెన్నను ముద్ద గోపాలుడు అడుగుతున్నాడన్న తన్మయత్వంతో నేలపాలు చేశాను - ఇంతా చూస్తే స్వామి మధురలోనే ఉన్నాడని వాపోయారట. దైవాన్నే ప్రేమించేవారు - వ్యవహారం చేయడమంటే ఎంతటి కఠిన కార్యమో కదా! పూజా విధానాలన్నీ ప్రేమను వ్యక్తం చేసే మార్గాలుగా అభివర్ణిస్తారు శ్రీబాబూజీ. అట్టి ప్రేమ మనలో నిండిపోవాలంటే వారి గురించి సమగ్రంగా

తెలియాలి. అందుకు వారు సూచించిన సులువు పారాయణ. అన్ని సమయాల్లో ఇలాంటి పూజావిధులు సాధ్యం కాకపోవచ్చు కనుక వారు చూపిన మరో సాధనా మార్గం మానసపూజ. శ్రీబాబూజీ చెంత ఎట్టి పూజావిధులు, క్రతువులు దర్శనమిచ్చేవి కావు. 'ప్రేమ' నిండిన మనసు ఆ ప్రేమను వ్యక్తం చేయడానికి మృదుమధురంగా, మనోహరంగా, మిక్కిలి ఆనందపూర్ణంగా ఉండే నవ్యమైన వ్యక్తీకరణలను, విధానాలను కనుగొంటుంది అనేవారు వారు. ప్రేమ ద్వారా ఆ సంపూర్ణానందాన్ని పొందే లక్ష్యంవైపు సాగే ఈ గమనం ఎంతగా అనుభవిస్తామన్నది ముఖ్యం అంటారు వారు. ఆ అనుభవంలో తనను తాను మరచిపోయి, సర్వజీవ చైతన్యమయిన సాయిలో లయించిపోవడం, ఆ తన్మయత్వపు తావు నుండే తన పేరు మరచి, ఆ సమర్థ సద్గురుని చరణాలలో కలిసి పోవడం జరుగుతుంది, అప్పటి వరకు ఈ జన్మజన్మల ప్రయాణం సాగుతూనే ఉంటుంది. ఆ 'పేరు' మరచి – ఆ అనంత'ప్రేమ'లో కలిసేంత వరకు వారి రాక కూడా కొనసాగుతూనే ఉంటుంది. చిట్టచివరి ప్రాణి పరిపూర్ణత్వాన్ని పొందే వరకు వారి ఆగమనం – ఆ జగన్నాటకంలో మనకు ఒక పాత్ర జన్మజన్మలకు లభించాలని ఆ సద్గురుచంద్రుని అర్థిస్తూ, వారి ప్రేమ సంద్రంలో ఓలలాడాలని తపిస్తూ.... **–గురుకృప**



## గురువుగారూ, బాబాతో ఎలా మాట్లాడాలి? బాబా మాట్లాడేది మనం ఎలా వినాలి?

**భక్తురాలు :** గురువుగారూ! మా అబ్బాయి, "బాబా మాట్లాడుతారా?" అని అడుగుతాడు ఎప్పుడూ. ఏమైనా ప్రాబ్లెమ్ ఉంటే బాబాకు చెప్పుకో. నీకు సాల్వ్ అవుతుంది అంటే. "సరే చెప్తాను. బాబా మాట్లాడుతారా నాతో? ఎప్పుడు మాట్లాడుతారు?" అని అడుగుతాడు.

**గురువుగారు :** మాట్లాడుతారు అని చెప్పు.

**భక్తురాలు :** అంటే ఎప్పుడూ నువ్వు ఇట్లాగే చెప్తావు. ఎప్పుడూ అబద్ధాలు చెప్తావు. నాతో మాట్లాడరు అంటాడు.

**గురువుగారు :** నువ్వు మాట్లాడేది పెద్దగా మాట్లాడితే వింటారు. ఆయన చెప్పేటువంటి మాట.. ఆయన మాట్లాడుతున్నారు కానీ నువ్వు వినడం లేదు అని చెప్పు.

**భక్తురాలు :** నాకేం వినిపించడం లేదు అంటాడు.

**గురువుగారు :** కాబట్టి నువ్వు కరెక్ట్‌గా మాట్లాడటం లేదని అర్థం. మాట్లాడుతారు అని చెప్పు. ఆయన మాట్లాడేది ఇట్లా ఉండదు. ఈ మాటల్లాగా ఉండదు. వేరే రకంగా ఉంటుందని చెప్పు.



ఇట్లా వినిపించదు ఆయన మాట్లాడే మాటలు, అర్థమవుతుంది.

**భక్తురాలు :** బాబా విగ్రహం చూపించి,  విగ్రహం కదా, బాబా విగ్రహం ఎట్లా మాట్లాడుతుందని అంటున్నాడు.

**గురువుగారు :**  బాబా విగ్రహం కాదు. బాబాతో మాట్లాడుతున్నావా, విగ్రహంతో మాట్లాడుతున్నావా అని అడుగు. విగ్రహంతో మాట్లాడితే విగ్రహం ఏం సమాధానం చెప్తుంది? చెప్పదు కదా! బాబాతో మాట్లాడితే సమాధానం దొరుకుతుంది. బాబా విగ్రహం కాదు. విగ్రహం బాబా కాదు. నువ్వు బాబాతో మాట్లాడు. బాబాతో మాట్లాడేదానికి, you have to speak into the microphone అంతే. మైక్రోఫోన్ సమాధానం చెప్పదు. ఆ విగ్రహం అటువంటిదే. ఫోన్లో మాట్లాడి హలో, హలో అనంటే, ఫోన్ మాట్లాడుతుందా? ఈ ఫోన్ లాంటిది బాబా విగ్రహం. నువ్వు బాబాతోకాదు మాట్లాడేది, నువ్వు విగ్రహంతో మాట్లాడుతున్నావు. అందుకే నువ్వు మాట్లాడలేకున్నావు. ఫోన్ ఆన్ చేసుకోకుండా హలో, హలో, హలో అంటే రెస్పాన్స్ ఏం వస్తుంది?  కరెక్ట్‌గా నెంబర్ డయల్ చేయాలి. ఆ ఎదుటివాడు నీకు తెలుసుండాలి. నీకు సమాధానం చెప్పడానికి.... ఇవన్నీ ఉంటే తప్పితే  ఆ ఫోన్లో నుండి మాట వినిపించదు. కాబట్టి ఇవన్నీ చేసుకో నాన్నా అని చెప్పు. ఇవన్నీ నేర్చుకోవడానికి సత్సంగానికి వెళ్ళాలి. ముందు బాబా నెంబర్ తెలుసుకోవాలి, తరువాత బాబాను నువ్వు పరిచయం చేసుకోవాలి. నేను ఎవరినంటే ఆహా, Hello, how are you boy? అనాలి ఆయన. ఇవన్నీ నేర్చుకోవాలి నాన్నా, ఇవన్నీ నేర్చుకునేదానికోసంగానే నువ్వు సత్సంగానికి వెళ్ళేది అని చెప్పు.

**భక్తురాలు :** గురువుగారూ! బాబాతో మాట్లాడాలంటే ఎటువంటి గుణాలుండాలి? ఎటువంటి అర్హతలు ఉండాలి మనకు?

**గురువుగారు :** బాబాతో మాట్లాడాలంటే, ఇంట్లో ఉండే మాట్లాడుకోవాలి అనుకున్నట్లయితే ఎటువంటి గుణాలు, ఎటువంటి అర్హతలు ఉండాలి మనకు? అని అడుగుతున్నారు. ముందు 'బాబా' అంటే ఎవరో తెలిసి, ఆయనపట్ల మనకు అవగాహన పెరిగి, ఆయనతో మాట్లాడాలనేటువంటి జిజ్ఞాస మనలో బలంగా ఉంటే, నువ్వెక్కడ మాట్లాడినా వినిపిస్తుంది. నిప్పును తాకాలనుకుని, నిప్పు బొమ్మను తాకామనుకోండి. కాలుతుందా? అట్లాగే సరిగ్గా 'బాబా' అంటే ఎవరో మనకు అవగాహనకు వచ్చి, మనం ఆర్తితోగానీ, చెప్పగలిగితే మాట్లాడగలగుతారు. ముఖ్యంగా మనక్కావలసింది ఏమిటంటే

‘ఆర్తి’. అవగాహనకంటే కూడాను ఎక్కువ ప్రధానమైనటువంటిది లోపల ‘ఆర్తి’. బాబాతో మనం మాట్లాడుతున్నామంటే మాట్లాడాలనేటువంటి తపన లోపల కలిగితే మాత్రం ఆయనకు చేరుతుంది. అట్లా ఉండేటువంటివాడు ఎప్పుడూ కూడాను, బాబాకు ఎట్లా ఉండటం ఇష్టమో, ఇంకొక లక్షణం చెప్పాలంటే చెప్తాను. బాబాకు మనమెట్లా ఉంటే ఇష్టమో మనకు తెలుస్తుంటుంది. ఇట్లా ఉండటం బాబాకిష్టం ఉండదు. ఇట్లా ఉంటే బాబాకిష్టం అనే విషయం తెలుస్తుంటుంది. బాబాకు మనమెట్లా ఉండటం ఇష్టమో, అట్లా ఉండగలగడం ఇంకొక లక్షణం. అపుడు మనం చెప్పేది ఆయనకు వినపడటమే కాదు, ఆయన చెప్పేదీ మనకు వినిపిస్తుంది. అంతే ... దానికి సరైన రెస్పాన్స్ వస్తుంది వెంటనే. లోకల్‌కాల్‌తో మన మాటలు అక్కడికి చేరతాయి. అవుట్ గోయింగ్ ఉంది. ఆ తరువాత ఇన్ కమింగ్ ఏర్పాటు చేసుకుంటే వినిపిస్తుంది.



**భక్తుడు :** సొల్యూషన్ కోసం మనసుతో మాట్లాడవచ్చా?

**గురువుగారు :** అవసరం ఉంటే మనసుతో మాట్లాడు.

**భక్తుడు :** అలాంటపుడు ఇవి అన్నీ pseudo needs కదా సార్. నేను మాట్లాడలేను. మనసు మాట్లాడలేకపోయింది. అపుడు? అది రిసీవ్ చేసుకోలేకపోతాము కదా సార్.

**గురువుగారు :** ఏంటి?

**భక్తుడు :** ఏదైనా మనసుతో మాట్లాడటం అంటే మీకో, లేకపోతే బాబాకో మేము అందించగలగడం, అక్కడ నుండి రిసీవ్ చేసుకోగలగడం.

**గురువుగారు :** రిసీవ్ చేసుకోకపోతే పరవాలేదు. అవసరం ఉంటే మాత్రం ఆన్సర్ వస్తుంది. దానికేం అనుమానం అక్కర్లేదు. ఇక్కడికే వచ్చి ఇట్లా చెప్పుకోవలసిన అవసరమేమీ లేదు. కానీ చెప్పుకుంటే ఒక తృప్తి ఉంటుంది. దానిని నేను నిరుత్సాహపరచడం లేదు. అదే అని చెప్పడం లేదు.

**భక్తుడు :** దాన్ని బట్టే ఆన్సర్ రాకపోతే, యాక్చువల్ నీడ్ కాదా, సార్?

**గురువుగారు :** అది మనకే తెలుస్తుంది. అది లోపల మనకే తెలిసిపోతుంటుంది. అడిగేటపుడు తెలిసిపోతుంటుంది. జాగ్రత్తగా ఆలోచిస్తే ఇది అడిగేటపుడు ఇంకో రెండు, మూడు కౌంటర్ ఆలోచనలు లోపల దాన్ని బ్యాలెన్స్ చేస్తుంటాయి. పట్టి లాగుతుంటాయి. ఆ పట్లు ఉన్నంతవరకు అట్లా వెళ్ళి



గోల్‌లో పడదు. అది లేనపుడు మాత్రం తప్పనిసరిగా గోల్‌లో పడుతుంది. గోల్ వస్తుంది. అది ఏమిటనేది ఎవరికి వాళ్ళు ఆలోచించుకోవాల్సిందే. ఎవరికి వాళ్ళు ఆలోచించుకోండి. ఎందుకంటే ఒకొక్కసారి అట్లా చెప్పుకోవడమే మన నీడ్ అవుతుంది. అందుకని, ఆ నీడ్ తీరినా, తీరకపోయినా మనకు బాధ ఉండదు. మనవాళ్ళు చెప్తుంటారు చూసారా, ఆ బాధ వెళ్ళగక్కుకుంటే చాలంటే, అబ్బా, నా మనసు హ్యాపీగా ఉంది అనంటాం.

నేను అరుణాచలంలో ఉండేటపుడు, ఒకతనికి వ్యాపారరీత్యా ఒక ఇబ్బంది వచ్చింది. మనిషి కుచించుకుపోతున్నాడు. దాదాపు రోజు ఏడుపు, అరుణాచలం వచ్చేసి, నాతో మాట్లాడాలి అనేటువంటి తపన, నిద్ర లేదు. గందరగోళం అయిపోయివున్నాడు. నేను వచ్చాను. వచ్చినరోజు సాయంత్రమే వచ్చి, సార్, ఇట్లా జరిగింది అని చెప్పాడు. అంతే అతని ప్రాబ్లెమ్ ఇంతవరకు ఏమీ తీరలేదు. అతడు దాని గురించి వర్రీ కావడం లేదు. నాకు చెప్పుకోవాలి. అంతే. ఇట్లా జరిగింది అని నాకు చెప్పాలి. అది అతని తపన. ఆ నీడ్ తీరింది. ఇపుడు హ్యాపీగా ఉన్నాడు. ఈ రోజు ఉదయమే అంటున్నాడు “నాకు దాని గురించి ఆలోచనే లేదండి. నాకు రమ్మన్నా రావడం లేదు. ఆ ఆలోచన”. నిజానికి చాలా పెద్ద సమస్య అది. చిన్న సమస్య కాదు. అతని జీవనోపాధికి సంబంధించిన విషయమది. మీకు చెప్పుకోగానే నాకు దాని గురించి ప్రాబ్లెమ్ పోయింది. ప్రాబ్లెమ్ ఏది అక్కడ? అతనికి వ్యాపారరీత్యా వచ్చినటువంటి సమస్య తీరడం అన్నట్లయితే. అది తీరితే మనశ్శాంతి వస్తుంది అనుకున్నట్లయితే అతనికి తీరలేదు. కానీ మనశ్శాంతి వచ్చింది. ఎందుకు వచ్చింది? చెప్పుకోవడం వల్ల వచ్చింది. కాబట్టి చెప్పుకోవడం అతని నీడ్. అవి రకరకాలుగా ఉంటాయి.

ఒక వ్యక్తికి, ఒక వ్యక్తికి వాళ్ళ యొక్క ఎమోషన్స్ మీద. వాళ్ళ యొక్క మనఃస్థితి మీద. ఎన్నో వాటి మీద ఆధారపడి ఉంటాయి. అవి బాహ్యంగా బయటకి చూసి మాత్రం మనం నిర్ణయం చేయకూడదు. మామూలుగా మాట్లాడటం చేతకాదు అని చెప్పి, నువ్వేమైనా మాట్లాడకుండా ఉన్నావా? అట్లాగే మనస్సుతోటి మాట్లాడు. ఎట్లా మాట్లాడటానికి ప్రయత్నం చేస్తున్నావో అట్లాగే. ఆ పదాన్ని గురించి ఆలోచించు రేపంతా. దాంట్లో ఉండేటువంటి అంతరార్థం తెలుస్తుంది. మనసు‘తో’ అంటే ఏమిటి? ఫలానా ఆయనతో మాట్లాడాను అంటాం. అంటే ఎట్లా అది? నోటితో మాట్లాడాను అంటాం. ఈ ‘తో’ అనే దానికి అర్థం ఏమిటని? మనసు‘తో’ మాట్లాడాలి అంటే మనసు మనకంటే



భిన్నంగా ఉండాలి లేదు మనసు 'ద్వారా' మాట్లాడాలి అంటావా, మనసు కంటే భిన్నంగా కూడా మనం ఉండాలి. లేదు మనసు'ద్వారా' మాట్లాడాలి అంటావా, మనసు కంటే భిన్నంగా కూడా మనం ఉండాలి. ముందు ఉండండి. అర్థమైందా నేను చెప్పింది? ఒక వ్యక్తి మరొక వ్యక్తితో మాట్లాడుతున్నాడు. ఆయనతో మాట్లాడుతున్నామండీ అంటాం. అక్కడా 'తో'నే. దీని'తో' మాట్లాడుతున్నాను అని అంటాం. నోటి'తో' మాట్లాడుతున్నానండీ అంటున్నాము. నోటిద్వారా అని అర్థం ఇక్కడ. నోటి 'ద్వారా' మాట్లాడినా, ఇంకొకరి'తో' మాట్లాడినా దానికంటే మనం భిన్నంగా ఉండాలి. కాబట్టి మనసు కంటే మనం భిన్నంగా ఎట్లా ఉన్నామో ఆలోచించండి. ఒక చిన్న క్లూ లాగానే నేను చెప్పాను. అంతే. ఇట్లా ఆలోచించుకుంటూ పోతే, మనసుతో మాట్లాడతానికి ప్రయత్నం చేయండి అని నేను చెప్పినదానికి ఎన్ని అర్థాలో తెలుస్తాయి మీకు.

మనసుతో మాట్లాడటం అంటే... కూర్చొని మనసులో బాబా, బాబా నన్నిట్లా చేసావు, అట్లా చేసావు, ఇట్లా అనుకుంటున్నాను, అట్లా అనుకుంటున్నాను అని అనుకోవడం కాదు. అది ఎప్పుడూ అనుకుంటూనే ఉన్నాము మనం. మనసు ప్రశాంతంగా మనసులో ఆలోచనలు లేకుండా మాట వస్తుందా అసలు? ముందు మనసు మాట్లాడితేనే ఎవరైనా మాట్లాడేది. మనసుతో మాట్లాడటానికి మీరు అనుకునేటువంటి అర్థంలో మనం ప్రయత్నం చేయాల్సిన అవసరం లేదు. మాట్లాడకుండా ఉండటానికి ప్రయత్నం చేయాలి. మనసుతో మాట్లాడటం అనే ప్రశ్న రాదసలు. కాబట్టి ఇట్లా మాట్లాడటం సంగతి కాదు నేనసలు చెప్పింది. అది ప్రయత్నం చేస్తే తెలుస్తుంది. దానికంటే ముందు ఇది చెప్పామనకో, ఉపయోగం లేదు.

**భక్తుడు :** ఎవరో వ్యక్తులతో మాట్లాడినట్లు మాట్లాడాలి, గమ్మన కూర్చోవడం కాదు...

**గురువుగారు :** ఆలోచించు. ఆన్సర్ అడక్కు. ఎందుకంటే మనసుతో మాట్లాడటం ఎట్లా చేతనవుతుందంటే, దాని గురించి ఆలోచించి, అభ్యాసం చేస్తే తెలుస్తుంది. మధనపెట్టు దాన్ని! ఒక **Intellectual** క్రింద నేను ఒక ఆన్సర్ చెప్పాననుకో. అక్కడికి శాటిస్ఫై అయిపోతుంది. మాట్లాడటం మాత్రం మాట్లాడలేవు. ఎట్లా మాట్లాడగలవు, అని తెలుసుకుంటావు అంతే. మనకు కావాల్సింది మాట్లాడటం చేతనవడం. అందుకనే వాటి సంగతేమీ మాట్లాడకుండా ఊరికినే చెప్పానంతే. మనసుతో మాట్లాడండి అని.

– ***శ్రీబాబూజీ***



# గురుకృపాలహరి

"దైవం" అనే వెలుగుకు ఎన్ని చిక్కటి చిమ్మచీకట్లు అడ్డుగా అలముకుంటాయో అందుకు అంతే ప్రతిస్పందనగా, ఆ 'వెలుగు' జగత్తులోని అవసరమున్న జీవుల కోసం తేజోపుంజములతో అనుగ్రహ ఆగమనం గావిస్తుంది. అనుగ్రహాభిషేకం చేస్తుంది. గీతాచార్యుని మాటల్లో 'గ్లాని' కల్గినపుడల్లా తాను అవతరిస్తానని చెప్పినట్లు, మానవజాతికి మహోపకారం చేయాలన్న మహాత్ముని తహతహలాడే నైజం, సర్వజీవులలోనూ ఉన్నది వసిస్తున్నది కేవలం భగవంతుడేనన్న నిజం, ఆ భావాన్ని ప్రతీ మనిషిలోనూ పాదుకొల్పాలన్న వారి ప్రేమ అవ్యాజం. రామాయణ, భారతేతిహాసాలు సత్యములేనన్న స్ఫురణకు పరమాచార్యస్వామి, శ్రీసాయిబాబా, భగవాన్ శ్రీరమణమహర్షి, శ్రీబాబూజీ వంటి వారి జీవితములు, వారి ఆచరణ, వారి మహిమ, వారి మార్గం, వారి మాతృత్వం, వారి దివ్యత్వం ఇవే సజీవ సాక్ష్యాలు. సద్గురు అనుగ్రహ తేజోపూర్ణమైన గురుపూర్ణిమ క్షణాలలో సద్గురుచంద్రుని అనుగ్రహదృష్టికి స్పష్టమైన తార్కాణం పరమాచార్యస్వామివారి జీవితం. తమ సద్గురుచంద్రుల ప్రేమపూరిత దృక్కులకై, వారి గురువు రూపాన్ని కేవలం చూస్తూ ఉండటానికై ఆకలిదప్పులు మరచి కేవలం కాలాటెక్కల్ ఆకులతోనే తమ శరీరాన్ని నిలుపుకున్న శ్రీసాయినాథుని జీవితం ఒక కోణాన్ని చూపితే, కేవలం తమ గురువుగారి చూపు, మూడు నాలుగు ప్రశ్నలతో మాత్రమే ఆధునిక భారతావనికి, సమున్నత శరణాగతికి ఒక చుక్కానిలా, లక్షలాది మందిని ధర్మమార్గంలో ఈనాటికి నడుపుతున్న 'పరమాచార్య'నిగా ప్రవర్తిల్లేలా చేస్తోంది. ఇదీ గురువు యొక్క కరుణార్ద్రదృక్కుల పరమోత్కృష్ట విశేషం, వైభవం. మానవజాతికి గురువే గతి, గురువే ధృతి, సద్గురు చరణాలే నిత్య సంతుష్టి. సర్వకాల, సర్వావస్థల యందు మారని 'సత్యాన్ని' దేశకాల పరిస్థితులకనుగుణంగా ఆచరణాత్మక జీవన విధానంగా మలచి 'ధర్మం' అనే ఇరుసుతో కలిపి ఆనందజీవనయానంగా మలచే మహిత సారధి–గురువు. అందుకే వారు బహుకోణాల్లో దర్శనమిస్తారు. ఓ వంక కారుణ్యమూర్తిగా–అశ్రయించి శరణన్న వారిని కాపాడే తల్లిగా కనపడుతూనే మరో వంక అవసరమైతే దండించి గాడిన పెట్టే తండ్రిగానూ, ఆచరణను మార్చుకోకపోతే కఠినంగా ప్రవర్తించే ఆచార్యునిగానూ దర్శనమిస్తారు. మెల్లగా కంచికథలోకి మన అడుగులు వేస్తూ వెళ్దాము. కంచి కథ ఎప్పటికైనా మనల్ని చేర్చేది గురుచంద్రుని ఇంటికే. ఆద్యంతాలు లేని ఆ **'చరణాల'** చెంతకే.

'ధర్మం' అనే మాట భరతజాతిలో వినపడిందంటే మనకు ఆదికావ్య కథానాయకుడు శ్రీరాముడు



గుర్తుకు వస్తాడు. **"రామో విగ్రహవాన్ ధర్మః"** రాముడు మూర్తీభవించిన ధర్మము అంటారు వాల్మీకి. గుప్తంగా ద్యోతకమయ్యే రాముని గురువు విశ్వామిత్రుని గొప్పతనాన్ని కూడా గుర్తు చేసారు మా గురుదేవులు శ్రీబాబూజీ తమ గ్రంథరాజము సాయిభక్తి సాధన రహస్యంలో. ఎంతో సూక్ష్మమైనది, లోతైనది, అర్థవంతమైనది, ఆచరించదగినది, ఆచరించవలసినది 'ధర్మం'. శ్రీరామచంద్రుని ధర్మపత్ని సీతమ్మను క్రౌర్యంతో అపహరించాడు రావణుడు. తల్లడిల్లిపోయాడు మర్యాదా పురుషోత్తముడు. లక్ష్మణునితో అంటాడు "సోదరా! సీత లేకుండా నేను జీవించలేను. ఆమె నాకు ప్రాణం కంటే ఎక్కువ. ఆమె మరణిస్తే నేను ప్రాణత్యాగం చేస్తాను! శూన్యం ఆవహించిన ఆశ్రమంలో కలియతిరిగిన రాముడు పిచ్చివాడిలా ఏడ్చాడు. తేరుకోలేకపోయాడు. సమయం గడిచిన కొద్దీ ఆ ఉద్విగ్నతను తాళలేని రాఘవుడు "నా సీత ఇంతకు ముందు ఎలా ఉందో అలాగే నాకు అప్ప చెప్పకపోతే దేవతలనూ, రాక్షసులనూ వారి లోకాలతో సహా నాశనం చేస్తాను. పర్వతాలను పడగొడతాను. నదులూ, సముద్రాలూ ఇంకిపోయేలా చేస్తాను. గ్రహగతులు ఆగిపోయేలా చేస్తాను. అగ్నికి, సూర్యుడికి ఉన్న తేజస్సును హరిస్తాను, వాయువును స్థంభింపచేస్తాను. ముల్లోకాలలో ప్రళయం సృష్టిస్తాను అంటూ ఆగ్రహోదగ్రడవుతాడు. లక్ష్మణస్వామి అన్న పాదాలకు అంజలి ఘటించి "రామా! నువ్వు తండ్రిగారి తపః ఫలానివి. జితేంద్రియుడివి, ధర్మమూర్తివి. ఈ కోపం నీకు తగదు. నువ్వు ఏ దోషమూ లేనివాడివి. సుఖదుఃఖాలు అందరికీ సహజమే. మహాత్ముని బుద్ధి వీటికి అతీతంగా ఉండాలి కదా! పృథ్వి, సూర్యచంద్రులకే ఈ బాధలు తప్పకపోతే మానవులు ఎంత గొప్పవారైనా వారికి కూడా కష్టాలు సహజమే కదా! సీతను ఎవరైనా అపహరించినా, ఆమె మరణించినా కూడా నీవు భావోద్వేగానికి లోనై దుఃఖించకూడదు. దుఃఖం నీ బుద్ధిని కమ్మివేయకుండా అదుపు చేసుకోవాలి. సీతమ్మ కోసం జనస్థానమంతా వెతుకుదాం. అప్పటికీ ఆ సాధ్వీమతల్లి కానరాకపోతే ఆయుధాలు చేపడదాం" అంటాడు. శ్రీరామునిది భర్త ధర్మం. లక్ష్మణస్వామిది సోదర ధర్మం. అన్యోన్య దాంపత్యపు అంతరాంతరాలను స్పృశించే వేళ రామునిలా (భర్త) ప్రవర్తించడమే ధర్మం. ఆ ఎడబాటనే దావానలం సమస్త సృష్టిని కబళించి ప్రళయం రాకుండా కాపాడటం ఆ వివేక పూర్ణుడు లక్ష్మణస్వామి సోదర ధర్మం. అపహరించిన రాక్షసరాజు గాలి సోకినా తట్టుకోలేని పాతివ్రత్యం తల్లి సీతమ్మ ధర్మపత్నీ ధర్మం. ఇలా మన ప్రతీచాలు 'ధర్మ' జీవనమే.

పరమాచార్యస్వామి జీవితచరిత్రకు, రామాయణానికి సామ్యమెక్కడిది అని సందేహం కలిగింది



కదా! ఇదిగో ఇదీ పరిస్థితి. 1962వ సంవత్సరంలో మకరరాశిలో ఒక్క రాహువు తప్ప మిగిలిన అష్టగ్రహాల కూటమి సంభవించడం, ప్రజలు కొంత భయానికి గురి అవుతున్న సమయంలో, స్వామివారు భక్తులు ఆచరించవలసిన, పారాయణ చేయవలసిన అంశములను తెలియచేయడం జరిగింది. ఇది కేవలం ఖగోళ అంశమే కానీ ఇతర భయములకు తావు ఇవ్వద్దని స్వామి తెలియచెప్పారు. ట్రావెన్‌కోర్ మహారాజు గారి కుటుంబం స్వామివారిని దర్శించుకోవడం, మొట్టమొదటి ఆగమ శిల్ప సదస్సు చాతుర్మాస్యంలో జరగడం ఇలా ముఖ్య సంఘటనలు జరిగాయి. నవంబర్ మాసంలో భారత్-చైనా యుద్ధం ప్రారంభమయి దేశం గడ్డు స్థితిలోనికి వెళ్ళింది. వారు కూర్చొన్న గోడకు చేరిన చెదపురుగులు వారి శరీరాన్ని ఆహారం చేసుకుని కుడుతుంటే అంతే వాసులను పిలిచి ఆ పురుగులకు హాని కలుగకుండా శ్రావణంతో తీసివేయమని చెప్పిన పరిపూర్ణ అహింసా స్వరూపం పూజ్య పరమాచార్యస్వామి. అలాంటిది దేశం యుద్ధం వైపుగా సాగుతుంటే శాంతివచనాలను పలుకుతారని అనుకుంటారు ఎవరైనా! కానీ వారు దేశరక్షణకై ప్రతీపౌరుడు, ప్రతి కుటుంబం బంగారాన్ని ఇచ్చి, రక్షణనిధిని ఏర్పాటు చేయమని పిలుపునిచ్చారు. ఆలిండియా రేడియో వేదికగా వారు ఇచ్చిన సందేశం. “భారతీయులందరి హృదయాల్లో ఒకే ఒక ధృడ సంకల్పం నిలబడాలి. అది భగవంతుని పట్ల అనన్యభక్తి, మన సైనికుల చేతుల్లో విజయసంపత్తినందించే ఆయుధాలు. రాజకీయ నాయకులకు, రాజనీతిజ్ఞులకు ఒక ముఖ్య సూచన ఏమంటే - వ్యతిరేక భావాలను పెంపొందించే ఎట్టి అభిప్రాయాలను బహిరంగ కార్యక్రమాల ద్వారా ప్రచారం చేయవద్దు. సామవేదములోను, ఉపనిషత్తులలోనూ పరాదేవతయైన కామకోటిని హిమాలయ పుత్రికగా అభివర్ణించారు. ‘అ’, ‘ఉ’, ‘మ’ల సంగమమైన ఆ తల్లి మార్మికమైన ఆధ్యాత్మిక శక్తిని వెదజల్లుతూ, బంగారు ఆభరణాలతో ప్రకాశిస్తోంది. దేవదానవ వైరంలో విజయులైన దేవతలు అహంకారంతో, అర్థంలేని విజయగర్వంతో మసలుతున్న సమయంలో వారిని అనుగ్రహించి విముక్తిని బోధించింది. మనం కూడా మన ‘అహాన్ని’ కాలరాయమని ఆ తల్లిని ప్రార్థిద్దాము. గీతాచార్యుడు ఇలా అంటాడు “నేను అన్న అహంభావంతో ఎవరి మనసైతే కలుషితం కాలేదో, అతడు ఎందరిని సంహరించినా, అతను సంహరింపబడినా అతడికి మరణము లేదు” అని. ఒక్క విషయం గుర్తుంచుకోండి. అత్యయిక పరిస్థితులలో ఏం చేయాలి? ఆ తల్లి పాదాలను సదా మనసులో నిలుపుకోవాలి. ఏ తల్లి పాదాలను భరతవర్షంలో మహారాష్ట్రలో తుల్జాభవానిగా, కాశ్మీర్‌లో క్షీరభవానిగా, గుజరాత్‌లో అంబాజీగా, ఉత్తరప్రదేశ్‌లో



వింధ్యవాసినిగా, బెంగాల్‌లో మహాకాళిగా, అస్సాంలో కామాఖ్యగా, కర్ణాటకలో చాముండిగా, కంచిలో కామాక్షిగా, దక్షిణభాగం చివరన కన్యాకుమారిగా ఇలా వందలాది రూపాలతో ఆ తల్లి పాదాలనే స్మరించుకోవాలి. బిడ్డలమైన మనందరినీ ఆ తల్లి ఎల్లప్పుడూ కాపాడుతూ అప్రమత్తంగానే ఉంటుంది. విజయం సిద్ధిస్తుంది. మన మాతృభూమి పరిరక్షణ కొరకు. యుద్ధవీరుల కోసం మనందరమూ గ్రామ గ్రామాన, ప్రతీ ఒక్కరూ హిమవంతుని తనయ ఆ తల్లి (ఉమ) కోసం ఒక చిన్న బంగారు పుష్పాన్ని ఆవిడ పాదాల చెంత సమర్పిద్దాం. 'విజయలక్ష్మి' త్వరలోనే మన మాతృభూమిని పునీతం చేస్తుంది. ఆ తల్లి అనుగ్రహానికి గుర్తుగా మన దురభిమానులు కూడా స్నేహితులుగా మారడం, స్త్రీల పట్ల సోదరభావం కలగడం జరుగుతుంది. తల్లి కామాక్షి ముఖస్తుతిలో చెప్పినట్లు "ఆమె చల్లనిచూపు సోకిన వారు అడవిని కూడా భవంతిగానూ, శత్రువును కూడా స్నేహితునిగాను, స్త్రీల పెదవులను మట్టిగానూ భావించగలుగుతారు". అయితే దురాక్రమణదారుడైన శత్రువును ఖచ్చితంగా శిక్షించవలసిందే. ఆ సమయంలో అహంభావం లేకుండానూ, ద్వేషాన్ని నింపుకోకుండానూ ఉండగలగాలి. ఎలా అయితే తన పుత్రుడే అయినా తప్పు చేసినప్పుడు ధర్మమూర్తి అయిన రాజు ఎలా అయితే స్నేహ పూర్వకంగానే శిక్షిస్తాడో, అలాగే మన శత్రువును కూడా శిక్షించాలి. శత్రువుతో పోరాడుతున్నా సరే! మనలో ఆ స్నేహ భావం ఎప్పటికీ నిలిచి ఉండాలని తల్లి కామాక్షిని ప్రార్థిద్దాము. ధర్మోచితమైన విధానాలనే మనమూ, ఎదుటి వారూ కూడా పాటించేలా దీవించమని ఆ తల్లిని వేడుకుందాం. అభ్యుదయమూ, విజయమూ ఇవే మన ధృడమైన విధానములవ్వాలి. యోగాచార్యుడు కృష్ణుని యొక్క సన్నిధి, యోధుడైన అర్జునుని చేతిలో ఆయుధములు ఉన్న వారికి విజయమెలా సిద్ధించిందో అదే విధంగా ధర్మ బృందావనమైన ఈ భరతభూమిలో భగవంతుని మనసున నిలుపుకున్న వారికి విజయము, అభ్యుదయము నిస్సంశయము. భిన్న స్వర స్థాయిలను కల్గిన వేణునాదము ఏ ఒక్క శృతితోనయితే ఏకరూపముగా, శ్రావ్యముగా గానం చేస్తుందో – భిన్న భావాలు కల్గిన మనమందరం దేశం కోసం ధర్మమును మాత్రమే ఆశ్రయించి విజయులమవుగాక!" అంటూ భరతజాతికి దిశా నిర్దేశం చేసారు ఆ క్లిష్ట సమయంలో.

ధర్మము చాలా సూక్ష్మతరము. అహింసనే అత్యుత్తమ ధర్మముగానెంచిన ఆచార్యులు, పౌరధర్మమును ఓ వంక, దేశమునకు దిశానిర్దేశము చేయు సమయమున పీఠాధిపతిగా ఓ వంక, రాజకీయ నాయకులు, వివేకవంతులు భిన్న అభిప్రాయములను వెలిబుచ్చకుండా నియంత్రించే క్రమమున



సంస్కర్తగా ఇలా బహుముఖముల వారి ధర్మమును నిర్వహించారు.

పరిణామములో ఎన్ని జన్మల తర్వాతనో గానీ మానవజన్మ లభించదని భరతజాతికి తెలిసినంతగా ఇతర దేశ వాసులకు తెలియకపోవచ్చును. బాహ్యంగా జరిగే పోరయుద్ధాలతో సతమతమైన జీవితాలలో చీకటి మాత్రమే నిండిన దేశములు, పౌరులు ఎందరో కదా! ఈనాడు భారతీయులు మాత్రము తమ అంతఃశత్రువులైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలతో కొట్టుమిట్టుకులాడుతూ అహం స్ఫురణలో ఆయువునంతా వృథాచేసుకుంటూ దైవానికి దూరమవుతున్నారు. “గత ఐదు వందల సంవత్సరాలలో అత్యంత విలాసవంతంగా ఎలా జీవించవచ్చో పాశ్చాత్యులు తెలుసుకొని, జీవించయత్నిస్తే భారతీయ ఆధ్యాత్మిక స్రవంతి మాత్రము అతితక్కువ వనరులతో అత్యంత సంతోషంగా ఎలా జీవించవచ్చో నిరూపించింది. అయితే ఈ గర్వించదగ్గ విషయాన్ని మరచి మనందరం కూడా పాశ్చాత్యధోరణిలో విలాసవంతమైన జీవితం వైపు మరలుతూ మన మూలాలను మరచిపోతున్నాం” అంటారు స్వామిశితికంఠానంద. కేవలం 13 ఏళ్ళ బాలుడు గురువు యొక్క మార్గదర్శనం కూడా లేకుండా శంకరులు అధివసించిన పీఠమునకు అధిపత్యమును వహించి ఇంతటి మార్గదర్శనము ఈ జాతికి చేయగలిగాడంటే ఇంకనూ దైవంపట్ల, సద్గురుచంద్రుల పట్ల, ధర్మము పట్ల మనకు ధృతి కలుగుట లేదంటే పరిణామంలో మనం ఎక్కడ ఉన్నామో మనకు మనం ప్రశ్నించుకోవలసిందే.

‘ధర్మము’ అనే మాట వినగానే మనసున నిలిచే స్వరూపము మా గురుచంద్రులు శ్రీబాబూజీ రూపమే. వారి బాల్యముననే శ్రీవేంకటేశ్వరుని పిలుపులోనే ఆధ్యాత్మిక సౌరభము పరిమళించినా విద్యార్థిగానూ, నాయకునిగానూ, సోదరునిగానూ, సచ్ఛిష్యునిగానూ, తల్లిదండ్రులను గౌరవించే బిడ్డగానూ, నిత్యముక్తస్థితిని పొందినా ఎందరినో శ్రీసాయినాథుని దరి చేరేందుకు తనను తాను శ్రీసాయికే సమర్పించుకున్న అనన్య శరణాగతికి ఆచార్యుడైన సద్భక్తునిగానూ ఇలా వారు ధర్మ స్వరూపులై సాయిపథగాములకే గాక, ప్రతీ సాధకునికి స్ఫూర్తిని అందించారు. “మనిషి దైవంగా ఎదగడమే” తమ అభిమతంగా, సర్వ మానవ సౌభ్రాతృత్వమే సాయిమతంగా బిడ్డలకు దారి చూపారు. పరమాచార్యుల పట్ల పూజ్య భావము, మా గురుచంద్రుల పట్ల భక్తి భావము రెండూ వెరసి ఆనందజీవన యానము. పూర్ణమైన ఆ గురుచంద్రుల ఆశీస్సుల గురుతులలో మనందరి జీవితాలు పరిపూర్ణమవ్వాలని ఆకాంక్షిస్తూ... శుభం భవతు. సర్వులకూ సద్గురు చరణామృత ప్రాప్తిరస్తు. **– గురుకృప**

రోజూ నియమంగా పారాయణ చేసుకుంటే, మనకు మనసు మీద నియంత్రణ వస్తుంది. అలా పెట్టుకోవడం వల్ల మంచి జరుగుతుందని మనకు తెలుసు. పిల్లలకేం తెలుస్తుందమ్మా, పాపం? వాళ్ళకు అర్థం కాదు. ఎందుకు చదవాలి? ఈ పది వాక్యాలు, ఈ అధ్యాయం చదివితే నాకు మేలు ఎలా జరుగుతుంది? దీనికి, దానికి ఏమిటి సంబంధం? పిల్లలకు ఆ రకంగా అర్థం కానటువంటిది, అర్థం లేనటువంటి వాటికి మన పిల్లల్ని అలవాటు చేస్తున్నాం. వాళ్ళకు శాస్త్రీయ అన్వేషణ అలవాటు చేయండి. బాబా సత్సంగానికి రాలేదనంటే పిల్లవాడు చెడిపోతున్నాడు అనే భావంతో ఉండకూడదు. వాడు ఎందుకు చెడిపోతున్నాడనంటే, మీరు వాడిలో ఆ జిజ్ఞాసను కలుగచేయలేదు కనుక. వాడిలో ఆ అన్వేషణా దృక్పథాన్ని మీరు కలుగచేయడం లేదు కనుక. ఒక్కొక్క పిల్లవాడికి ఒక్కో రకంగా కలుగచేయాలి. ఎట్లా కలుగచేయాలో అట్లా కలుగచేయండి.

– గురువుగారి సత్సంగభాషణాల నుండి






ఆ నామం పలికే చోటు అత్యంత పవిత్ర స్థలం..
ఆ నామం తలిస్తే చాలు, వేయి ఏనుగుల బలం..
ఆ నామాన్ని ధ్యానించే జీవులకు సర్వదుఃఖహరం..
ఆ నామం లభించడం సాయినాథుని ప్రేమ వరం..
ఆ నామం సాధక జీవులకు నిత్య తపః ఫలం..
ఆ నామం అంతరంగాన్ని ప్రక్షాళన చేసే శుద్ధ గంగాజలం..